# టైమ్స్ ఆఫ్ వార్త

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : మంజుల దాసు

తెలంగాణ బుధవారం, 05 - మార్చి - 2025 సంపుటి : 16 సంచిక : 207 పేజీలు 08 వెల : 6/-


## బిజెపి అంటే నమ్మకం కాదు.. అమ్మకం

- ఆదిలాబాద్ సిసిఐ ఫ్యాక్టరీని తుక్కుగా అమ్మేందుకు కమలం కుట్రలు
- ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి ఇప్పుడు మోసం చేస్తున్న బిజెపి
- బిఆర్ఎస్ అగ్రనేత కెటిఆర్



టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) ఫ్యాక్టరీని తుక్కు కింద తెగనమ్మేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సిద్ధం కా వడం దుర్మార్గం అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు అన్నారు. సిసిఐని పునఃప్రారంభిస్తామని పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చి, ఓట్లు దండుకున్న బిజెపి, ఇప్పుడు ఆ సంస్థను స్క్రాప్ కింద అమ్మాలనుకోవడం ప్రజలను వంచించడమే అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిజెపి అంటే నమ్మకం కాదు.. అమ్మకం అని విమర్శించారు. సిసిఐ ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించాలని ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న నిరసనలు, వారి ఆర్తనాదాలు కేంద్ర ప్రభుత్వానికి వినిపించడం లేదా..? అని ప్రశ్నించారు. 772 ఎకరాల భూమి, 170 ఎకరాల టౌన్‌షిప్,

మిగతా 7లో..

## గునిగంటి కమలాకర్ జన్మదిన వేడుకలు



5లో..

## పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో

# సుప్రీం నోటీసులు..

- 22లోపు సమాధానమివ్వాలని ఆదేశం
- 25కు తదుపరి విచారణ



న్యూఢిల్లీ : తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో అసెంబ్లీ స్పీకర్ కార్యాలయానికి, రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘంతో పాటు, ప్రతివాదులకు సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ నెల 22 లోపు ఈ నోటీసులపై సమాధానమివ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. తదుపరి విచారణను 25కు వాయిదా వేసింది. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ ఏడాది జనవరి 15న ప్రతిపక్ష బీఆర్ఎస్ సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, దానం నాగేందర్‌లపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానందలు స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్పీ)ను దాఖలు చేశారు. మిగిలిన ఏడుగురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సంజరు కుమార్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, ప్రకాష్‌గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, అరెకపూడి గాంధీలపై కేటీఆర్ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై మంగళవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టైన్ జార్జ్ మాసిస్‌ల నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది అర్యమ సుందరం, నాయుడు, మోహిత్ రావులు, స్పీకర్ కార్యాలయం తరపు సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మనుసింఘ్వి, ముకుల్ రోహిత్గిలు హాజరయ్యారు. వాద ప్రతివాదనల అనంతరం ఫిరాయింపులపై నిర్ణయానికి సంబంధించి

మిగతా 7లో..



- 1,891 కోట్ల బకాయిలు చెల్లించండి
- సీఎంఆర్ డెలివరీ సమయం పొడిగించండి
- 4 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్తు ఉత్పత్తికి అనుమతులు పునరుద్ధరించండి
- మహిళా సమాఖ్యలకు బస్సులు అద్దెకు ఆర్టీసీకి.. బస్సుపై నెలకు రూ.77,220 రాబడి
- కొనుగోలుకు బ్యాంకు గ్యారంటీ ఇవ్వనున్న ప్రభుత్వం
- 8న తొలి విడతగా 150 బస్సుల ప్రారంభం

# బకాయిలు చెల్లించండి

## కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ వినతి

న్యూఢిల్లీ : ఎఫ్‌సీఐ 2014-15 ఖరీఫ్ కాలంలో సరఫరా చేసిన బియ్యానికి సంబంధించి తెలంగాణకు బకాయి పడిన రూ.1,468.94 కోట్లను వెంటనే విడుదల చేయాలని కేంద్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం కేంద్ర మంత్రిని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిశారు. నాడు అదనపు లెవీ సేకరణకు సంబంధించిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించిందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బకాయిలు పెట్టి పదేండ్ల యిందని, వాటిని వెంటనే విడుదల చేయాల ని కోరారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన కింద 2021 మే నుంచి 2022 మార్చి వరకు సరఫరా చేసిన అదనపు బియ్యం, 2022 ఏప్రిల్‌లో సరఫరా చేసిన బియ్యానికి సంబంధించిన ఉత్తర్వులను ధ్రువీకరించుకొని, అందుకు సంబంధించిన బకాయిలు రూ.343.27 కోట్లను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. 2021 జూన్ నుంచి 2022 ఏప్రిల్ వరకు నాన్ ఎన్ఎఫ్ఎస్ఏ (నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్) కింద పంపిణీ చేసిన బియ్యానికి సంబంధించిన బకాయిలు రూ.79.09 కోట్లు వెంటనే విడుదల చేయాలని కోరారు. సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) గడువును నెలా నెలా కాకుండా కనీసం నాలుగు నెలలు పొడిగించాలని, అప్పుడే సరఫరాలో ఎటువం టి ఇబ్బందులు తలెత్తవని తెలియజేశారు.

### 4 వేల మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తికి అనుమతులు పునరుద్ధరించండి : సీఎం

తెలంగాణ రాష్ట్రానికి పీఎం కుసుమ్ కింద గతంలో ఇచ్చిన 4 వేల మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తికి అనుమతులను పునరుద్ధరించాలని కేంద్ర పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణకు గతంలో నాలుగు వేల మెగావాట్లకు అనుమతులు ఇచ్చిన కేంద్రం తర్వాత దానిని వెయ్యి మెగావాట్లకు కుదించిందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో మహిళా

మిగతా 7లో..

## ఉక్రెయిన్‌కు

# సైనిక సాయం నిలిపివేత



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనా ల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీ ఇటీవల మీడియా ఎదుటే వాగ్వాదాని కి దిగడం యావత్ ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. ఈ నేపథ్యంలో అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. రష్యాతో యుద్ధం సాగుతున్న పరిస్థితుల్లో ఉక్రెయిన్‌కు అందించే మిలిటరీ సాయాన్ని నిలిపివేసింది. అధ్యక్షుడు ట్రంప్ శాంతిస్థాపనపై దృష్టి సారించారు. మా భాగస్వాములు కూ డా ఆ లక్ష్యానికి కట్టుబ డి ఉండాల్సిన అవసరం ఉంది. మేము మా సాయాన్ని నిలిపివేస్తున్నాం. ఇది ఒక పరిష్కారాన్ని చూపిస్తోంది " అని వైట్‌హౌస్‌కు చెం దిన ఓ అధికారి వెల్లడించారు. అయితే ఇది తాత్కాలికమేన ని వెల్లడించారు. రష్యాతో శాంతి చర్చలకు కీవ్‌పై ఒత్తిడి తెచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. లండన్‌లో ఐరోపా దేశాధినేతల సమావేశం తరువాత జెలెన్‌స్కీ అగ్రరాజ్యంతో ఖనిజాల ఒప్పందానికి తాము సిద్ధమేనని ప్రకటించారు. ఉక్రెయిన్‌కు మిలిటరీ సాయం నిలిపివేయాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయా న్ని ఉక్రెయిన్ ప్రభుత్వం తీవ్రంగా ఖం డించింది. అగ్రరాజ్యం తమకు వ్యతిరేకంగా తీసుకుంటున్న చర్యలు క్రమం గా తమ దేశాన్ని రష్యాకు లొంగిపోయేలా చేయాలనే ఉద్దేశంతో చేస్తున్నట్టు ఉన్నాయని ఆ దేశ పార్లమెంటరీ విదేశీ వ్యవహారాల కమిటీ చీఫ్ మెరెజ్‌కో ఆరోపించారు.

# సింహాలతో మోడీ చెలిమి..



**హైదరాబాద్:** గాయపడిన, ఇబ్బందుల్లో ఉన్న జంతువులను సంరక్షించే లక్ష్యంతో 'వంతారా' కార్యక్రమాన్ని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, రిలయన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ అనంత్ అంబానీ ప్రారంభించిన విషయం తెలిసిందే. వన్యప్రాణుల రక్షణ, పునరావాసం, సంరక్షణ కేంద్రమైన ఈ వంతారాను మోడీ మంగళవారం సందర్శించారు. ప్రధాని మోడీ ప్రస్తుతం తన సొంత రాష్ట్రం గుజరాత్‌లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. సోమవారం ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా గిర్ అడవుల్లో సఫారీకి వెళ్లారు. ఇవాళ జామ్ నగర్‌లోని వంతారాను సందర్శించారు. వన్యప్రాణుల ఆసుపత్రిని, జంతువుల కోసం ఏర్పాటు చేసిన MRI, CT స్కాన్‌లు, ICUలు మొదలైన వాటితో కూడిన పశువైద్య సౌకర్యాలను వీక్షించారు. అంతే కాకుండా వైల్డ్‌లైఫ్ అనస్థీషియా, కార్డియాలజీ, నెఫ్రాలజీ, ఎండోస్కోపీ, డెంటిస్ట్రీ, ఇంటర్నల్ మెడిసిన్ మొదలైన అనేక విభాగాలను కూడా పరిశీలించారు. వంతారాలో పునరావాసం పొందుతున్న వివిధ జాతుల జంతువులతో ప్రధాని సన్నిహితంగా మెలిగారు. అక్కడ సింహాల పిల్లలకు, జిరాఫీలకు ఆహారం అందించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

## సెమీస్‌లో ఆస్ట్రేలియాపై భారత్ ఘన విజయం..

**హైదరాబాద్:** ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా ఫైనల్‌కు చేరుకుంది. మంగళవారం ఆస్ట్రేలియాతో జరిగిన ఉత్కంఠభరిత సెమీఫైనల్లో భారత్ నాలుగు వికెట్ల తేడాతో జయకేతనం ఎగుర వేసింది. బుధవారం సౌతాఫ్రికా న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగే సెమీ ఫైనల్ విజేతతో భారత్ ఫైనల్లో తలపడుతుంది. తుది పోరు ఆదివారం జరుగుతుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 49.3 ఓవర్లలో 264 పరుగులకు ఆలౌటైంది. తర్వాత లక్షఛేదనకు దిగిన టీమిండియా 48.1 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది. ఈ క్రమంలో 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఎదురైన ఓటమికి టీమిండియా ప్రతీకారం తీర్చుకుంది. మహ్మద్ షమి, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, కెఎల్ రాహుల్‌లు భారత్ విజయంలో కీలక పాత్ర పోషించారు.

ఆదుకున్న కోహ్లి, శ్రేయస్ : ఊరిస్తున్న లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన టీమిండియాకు ఆరంభంలోనే షాక్ తగిలింది. ఓపెనర్ శుభ్‌మన్ గిల్ మరోసారి నిరాశ పరిచాడు. గిల్8 పరుగుల మాత్రమే చేసి ఔటయ్యాడు. కెప్టెన్ రోహిత్ శర్మ 3 ఫోర్లు, ఒక సిక్స్‌తో 28 పరుగులు చేశాడు. దీంతో భారత్ 43 పరుగులకే ఓపెనర్ల వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లే బాధ్యతను విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్‌లు తమపై వేసుకున్నారు.

since 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com
జనరల్ న్యూస్
GENERAL NEWS
బుధవారం, 05-03-2025



## ఈవీఎం గోడౌన్ ను పరిశీలించిన కలెక్టర్



**టైమ్స్ ఆఫ్ వార్త – నిజామాబాద్ కలెక్టరేట్**

జిల్లా కేంద్రంలోని వినాయకనగర్ లో గల ఈవీఎం గోడౌన్ ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంగళవారం అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తో కలిసి పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సీల్ ను తెరిచారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్ లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ కొనసాగిన మరమ్మతు పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నాణ్యతతో పనులు జరిగేలా పర్యవేక్షణ చేయాలని పంచాయతీరాజ్ ఈ.ఈ శంకర్ ను ఆదేశించారు. సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించిన కలెక్టర్, అవి నిరంతరం పనిచేసేలా చూడాలన్నారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, ఇతర సామాగ్రికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా గోడౌన్ లోనే పూర్తి స్థాయిలో సదుపాయాలు కలిగి ఉన్న గదుల్లో భద్రపర్చాలని,చెదలు నివారణ కోసం అవసరమైన చోట పెస్ట్ కంట్రోల్ చేయించాలని అధికారులను ఆదేశించారు.పనులను పక్కాగా జరిపించాలన్నారు.కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సిబ్బంది సాత్విక్, విజేందర్,అగ్నిమాపక శాఖ అధికారి నర్సింగ్,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

## సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం కోసం పోరాడుదాం

- మహిళలపై హింసకు వ్యతిరేకంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుందాం
- ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు ఆకుల అరుణ పిలుపు




**టైమ్స్ ఆఫ్ వార్త – నిజామాబాద్ సిటీ**

సమాజంలో మహిళలు అన్ని రంగాలలో తమ ప్రతిభను చాటుకుంటున్నప్పటికీ వారికి దక్కవలసిన ఆర్థిక, రాజకీయ సమానత్వం అందడం లేదని, అందుకోసం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఉద్యమించాల్సిన అవసరం ఉందని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు ఆకుల అరుణ పిలుపునిచ్చారు. ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మార్చి 8న జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని నిజామాబాద్ నగరంలోని ద్వారక నగర్ కార్యాలయంలో సన్నహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు ఆకుల అరుణ మాట్లాడుతూ ఈ సంవత్సరం సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం కోసం పోరాడుదామన్నారు. మహిళలపై హింసను వ్యతిరేకిద్దాం, హైదరాబాదులో జరిగే 72వ ప్రపంచ అందాల పోటీలను అడ్డుకుందాం అన్న డిమాండ్లతో మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరపాలని రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందని తెలియజేశారు. తమ శక్తికి మించి ఇంటా బయట పనిచేస్తున్న మహిళలకు ఆర్థిక, రాజకీయ, సమానత్వం అందడం లేదని, ఉత్పత్తిలో సగభాగమైన స్త్రీ ఇంకా వివక్షతకు గురి అవుతుందని చెప్పారు. దేశంలో మహిళలకు ఏ రాజకీయ పార్టీ తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆవేదనను వెలిబుచ్చారు. నేడు సమాజంలో మహిళలపై హింస విపరీతంగా పెరిగి పోయిందని, కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్న జంటల పై విచ్చలవిడిగా దాడులు జరుగుతున్నాయని, వాటిని అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. మహిళలపై జరిగిన దాడుల విషయంలో న్యాయ స్థానాలు సైతం సరైన న్యాయాన్ని కల్పించ లేక పోతున్నాయని అక్రమార్కులను, నిందితులను శిక్షించకుండా వదిలి వేస్తున్నాయని అన్నారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిజాంబాద్ నగరంలోని ద్వారక్ నగర్ కార్యాలయం నుంచి ర్యాలీ అనంతరం సభ నిర్వహిస్తామని, ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు, తెలంగాణ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పిట్ల సరిత మాట్లాడుతూ స్త్రీని వ్యాపార వస్తువుగా చూపుతున్న 72వ ప్రపంచ అందాల పోటీలు హైదరాబాద్ నగరంలో ఎవరి ప్రయోజనాల కోసం నిర్వహిస్తున్నారని ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రభుత్వం మహిళా సాధికారత గురించి మాట్లాడుతూనే మరోవైపు అందాల పోటీలు నిర్వహించడం మూలంగా స్త్రీని వ్యాపార వస్తువుగా, అందంగా లేకపోతే మనిషే కాదు అనే విధంగా ప్రచారం నిర్వహిస్తుందన్నారు. ఒకవైపు భారత దేశంలో మహిళలంతా అణిచివేతకు గురవుతున్న పరిస్థితులలో అందాల పోటీలను భారతదేశంలో నిర్వహించడం అందులో హైదరాబాద్ నగరంలో నిర్వహించడం సరైనది కాదని, దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఒకవైపు కేంద్ర ప్రభుత్వం మహిళల రక్షణ కొరకు, అభివృద్ధి కొరకు కృషి చేస్తున్నామని ప్రకటిస్తూ అందాల పోటీల నిర్వహణకు మద్దతు పలకడం పరోక్షంగా మహిళల్ని అణిచి వేయడమేనని దీనిని వెంటనే ప్రభుత్వాలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ అందాల పోటీలను అడ్డుకుంటామని తెలియజేశారు. ఈ సమావేశంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భారతి, నగర అధ్యక్షురాలు నీలం లక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.

## అంగన్వాడీల అక్రమ అరెస్టులను ఖండించండి

- ఆరెస్టు అయిన అంగన్‌వాడీలను వెంటనే విడుదల చేయాలి
- సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్



**టైమ్స్ ఆఫ్ వార్త – నిజామాబాద్ సిటీ**

అంగన్వాడీల అక్రమ అరెస్టులను ఖండించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత 11 నెలలుగా పెండింగ్లో ఉన్న మినీ అంగన్వాడిల ఏరియాస్ వేతనాలను విడుదల చేయాలనీ, పెరిగిన వేతనాలను వెంటనే అమలు చేయాలని ప్రజా దర్బార్ హైదరాబాదులోని ప్రజావాణిలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు)అధ్వర్యంలో మంగళవారం వినతి పత్రం సమర్పించేందుకు బయలుదేరుతున్న మినీ అంగన్వాడిలను ప్రభుత్వం పోలీసుల చేత అక్రమ అరెస్టు పాల్పడుతోందని, మినీ అంగన్వాడీలతో పాటు మేయిన్ అంగన్వాడి లను కూడా అరెస్టు చేసి పోలీస్ స్టేషనులకు తరలించారని హౌస్ అరెస్టులు చేస్తూ అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారని, అంగన్వాడీల పై నిర్బంధ కాండను ఆపాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా పోలీసులు ఆరెస్టులకు పాల్పడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ నిర్బంధ పాలనకు తెరతీస్తోందన్నారు. ప్రజా పాలన అంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంగన్వాడీలను అరెస్టులు చేయడం ఏంటని ప్రశ్నించారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలి తప్ప ఆరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లలో పెట్టడం, నిర్బంధాన్ని ప్రయోగించడం వల్ల సమస్య పరిష్కారం కాదన్నా సంగతి ప్రభుత్వము గ్రహించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా రెస్ట్ అయినా సిఐటియు నాయకులను, అంగన్వాడీలను వెంటనే భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, సిఐటియు జిల్లా కోశాధికారి స్వర్ణ, జంగం గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి ఆశీస్సులతో నగర ప్రజలు సుఖశాంతులతో ఉండాలి

**నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల**

**టైమ్స్ ఆఫ్ వార్త – నిజామాబాద్ సిటీ**





రేణుక ఎల్లమ్మ వారి ఆశీస్సులతో నగర ప్రజలు సుఖ శాంతులతో జీవించాలని అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా అమ్మవారిని కోరు కున్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వినాయక్ నగర్ షిర్డీ సాయి నగర్ లో శ్రీ మావురాల రేణుక ఎల్లమ్మ దేవస్థానం విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నిజామాబాద్ నగర ప్రజలు అమ్మవారి ఆశీస్సులతో సుఖ శాంతులతో ఉండాలని కోరారు.కాలనీ వాసులు అందరూ కలిసి కట్టుగా ఉండి ఈ ఆలయాన్ని నిర్మించడం ఆనందంగా ఉందన్నారు. నగర ప్రజలకు ఎలాంటి కష్టం రాకుండా సుఖశాంతులతో అమ్మవారిని కోరుకున్నారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతులు వారి పాడి పంటలు పండి లాభాలతో వారి ముఖాల్లో ఆనందాన్ని చూడాలని కోరారు.అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే బీగాల గణేష్ గుప్తాను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ నగర మేయర్ దండు నీతూ కిరణ్, మాజీ నూడ చైర్మన్ చామకూర ప్రభాకర్ రెడ్డి, నగర అధ్యక్షుడు సిర్ప రాజు, సీనియర్ నాయకులు సుదాం రవిచందర్, సత్యప్రకాశ్, తడ్కల్ శ్రీను, చింతకాయల రాజు,బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ కోట దుర్గమ్మ ద్వితీయ వార్షికోత్సవంలో పాల్గొన్న పోచారం శ్రీనివాస్ రెడ్డి



**టైమ్స్ ఆఫ్ వార్త – బాన్సువాడ:**

బాన్సువాడ పట్టణ కేంద్రంలోని కోటగల్లిలో శ్రీ కోట దుర్గమ్మ దేవి ఆలయం ద్వితీయ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి,రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీ చైర్మన్ కాసుల బాలరాజు.గత మూడు రోజులుగా ద్వితీయ వార్షికోత్సవంఉత్సవాలు ఘనంగా జరిగాయి.చివరి రోజులో భాగంగా మహ పూర్ణాహుతి కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులతో కలసి పాల్గొని,భక్తులు ఏర్పాటు చేసిన అన్నప్రసాదాన్ని స్వీకరించిన పోచారం . ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, అమ్మవారి భక్తులు, తదితరులు, పాల్గొన్నారు.

## తెలంగాణ మాదిగ హక్కుల దండోరా జిల్లా అధ్యక్షునిగా పల్లె సమ్మయ్య బాబు



**టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-**

తెలంగాణ మాదిగ హక్కుల దండోరా(టిఎంహెచ్డి) జిల్లా అధ్యక్షునిగా పట్టణానికి చెందిన పల్లె సమ్మయ్య బాబు నియమితు లయ్యారు. ఈ మేరకు మంగళవారం సంఘం వ్యవస్థాపక జన్ను కనక రాజు ,రాష్ట్ర అధ్యక్షుడు కోరిపల్లి శ్రీనివాస్‌లు సమ్మయ్య బాబుకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిల్లాలో సంఘాన్ని బలోపేతం చేస్తూ, వర్గీకరణ కోసం జరిగే పోరాటంలో ముందుంటూ,అగ్రభాగాన మాదిగ జాతిని నిలిచేలా, మాదిగ జాతి విముక్తి కోసం ముందుండి, పోరాడాలని సూచించారు. అనంతరం జిల్లా నూతన అధ్యక్షుడు పల్లె సమ్మయ్య బాబు మాట్లాడుతూ,తనపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించిన సంఘం రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ జేశారు. ఎస్సీ వర్గీకరణ సాధించేవరకు మాదిగ జాతి ఐక్యత కోసం, కోసం పాటు పడతా నన్నారు. జిల్లాలో సంఘాన్ని బలోపేతం చేసి,జాతి హక్కుల కోసం నిరంతరం పోరాడతానని తెలిపారు.

## కార్మెల్ పాఠశాలలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం ఆకట్టుకున్న రంగోలి



**టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-**

పట్టణాన్ని కార్మెల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పాఠశాల విద్యార్థులు రంగోలి కార్యక్రమం నిర్వహించారు.ఈ రంగోలి కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో అందంగా భౌతిక, రసాయన, జీవ శాస్త్రాల పటాలను ప్రదర్శించగా,రంగోలి వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ ఫాదర్ జేవియర్ రెక్స్, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఏం కుమారస్వామి, జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు ఐ సునీత, ఇతర సైన్స్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, పిఈటి కృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ల్యాబ్ గదుల నిర్మాణం కోసం తక్షణమే ప్రతిపాదనలు పంపాలి





- నిర్వాహకులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- పోచంపాడ్ సోషల్ వెల్ఫేర్ స్కూల్ ను తనిఖీ చేసిన కలెక్టర్

**టైమ్స్ ఆఫ్ వార్త నిజామాబాద్ / మెండోరా**

అర్ధాంతరంగా నిలిచిపోయిన ల్యాబ్ గదిలో నిర్మాణాలను పూర్తి చేసేందుకు తక్షణమే ప్రతిపాదనలు పంపాలని సంబంధిత నిర్వాహకులకు జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు. మెండోరా మండలం పోచంపాడ్ లోని సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల/కళాశాలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ముందుగా సాంఘిక సంక్షేమ పాఠశాలలో కిచెన్ కం డైనింగ్ హాల్, స్టోర్ రూం డార్మెటరీలను సందర్శించి బియ్యం, కూరగాయలు, పప్పు దినుసులు, వంట నూనె, ఇతర సరుకుల నాణ్యతను పరిశీలించారు. సరుకుల స్టాక్ రిజిష్టర్ తనిఖీ చేశారు. చుట్టూరా ప్రహరీ గోడతో కూడిన సువిశాలమైన పాఠశాల ఆవరణను గమనించిన కలెక్టర్, ప్లే గ్రౌండ్ గురించి ఆరా తీశారు. అర్ధాంతరంగా నిలిచిపోయిన ల్యాబ్ గదుల నిర్మాణాలను పూర్తి చేయించేందుకు తక్షణమే ప్రతిపాదనలు పంపాలని నిర్వాహకులను ఆదేశించారు. కిచెన్ లో నిరుపయోగంగా ఉన్న స్టీమ్ యూనిట్ ను వినియోగంలోకి తేవాలని, 500 పైచిలుకు మంది విద్యార్థినులు కొనసాగుతున్నందున అన్నం, ఇతర ఆహార పదార్థాలు శుచి, శుభ్రతతో చక్కగా వండడానికి ఇది ఉపకరిస్తుందని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల ఇంచార్జ్ జోనల్ ఆఫీసర్ పూర్ణచందర్, స్కూల్ ప్రిన్సిపాల్ గోదావరి, పీ.హెచ్.సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాకేశ్ తదతరులు ఉన్నారు.

since 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com



# రైతు సంక్షేమం కోసమే చివరి శ్వాస వరకు పనిచేస్తా

- జాతీయ అధ్యక్షునిగా ఎన్నిక కావడం పూర్వజన్మ సుకృతం
- దేశంలోనే శక్తివంతమైన సంస్థగా నిలబెట్టాల్సిన బాధ్యత నాపై ఉంది
- సారంగాపూర్ ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించేందుకు ఎంతటి పోరాటానికైనా సిద్ధమే
- భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ అధ్యక్షుడు కొండెల సాయి రెడ్డి

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ





ఊహ తెలిసిన నాటి నుంచి రైతుల శ్రేయస్సు కోసమే పనిచేస్తున్న నేను నా చివరి శ్వాస వరకు రైతు సంక్షేమం కోసమే పని చేస్తానని భారతీయ కిసాన్ సంఘ్ నూతన జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన కొండల సాయిరెడ్డి వ్యాఖ్యానించారు. భారతీయ కిసాన్ సంఘ్ 46వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నూతన జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన కొండల సాయి రెడ్డి ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని జిల్లా శాఖ ఆధ్వర్యంలో మారుతీ నగర్ లోని గణేష్ భవన్ లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సాయి రెడ్డి మాట్లాడుతూ కిసాన్ సంఘ్‌లో సాధారణ కార్యకర్త స్థాయి నుంచి జాతీయ అధ్యక్షుడి స్థాయికి ఎదిగిన ఈ మొత్తం ప్రయాణం కేవలం వ్యవసాయం, రైతు, వ్యవసాయ అనుబంధ వ్యవస్థలతోనే ముడి పడిపోయిందని, తన జీవితం మొత్తంలో రైతు సంక్షేమం తప్ప వేరే లక్ష్యము ఏదీ లేదని తెలిపారు. జాతీయ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని, కానీ అదే సమయంలో దేశంలోనే అత్యంత శక్తివంతమైన రైతు సంస్థగా కిసాన్ సంఘ్ ను నిలబెట్టాల్సిన బాధ్యత తన మీద ఉందన్నారు. అంతేకాకుండా తెలంగాణ రాష్ట్ర నిజామాబాద్ జిల్లాలోని అన్ని గ్రామాలలో కమిటీలను ఏర్పాటు చేసి రైతాంగ సమస్యల గురించి పోరాటం చేయటమే లక్ష్యంగా పని చేస్తామని ఆయన వ్యాఖ్యానించారు. ఇందులో ప్రధానంగా సారంగాపూర్ చక్కెర కర్మాగారాన్ని తిరిగి ప్రారంభించడం ద్వారా వెయ్యి మందికి ఉపాధి, పంట మార్పిడి పద్ధతి ద్వారా వేలాది మంది రైతులకు ఉపాధి లభిస్తుందని, ఈ దిశగా ఆ ఫ్యాక్టరీని తిరిగి తెరిపించటం కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధపడతామని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో ఫ్యాక్టరీని తిరిగి తెరిపిస్తామని హామీ ఇచ్చినట్లుగా గుర్తు చేశారు.రైతు తోనే సమాజ పరివర్తన సాధ్యం.. ఆర్ఎస్ఎస్ విభాగ ప్రచారక్ నర్రా వెంకట శివకుమార్ ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా విచ్చేసిన ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ నర్రా వెంకట శివకుమార్ మాట్లాడుతూ రైతు ద్వారానే సమాజంలో పరివర్తన సాధ్యమవుతుందని భూమిని తల్లిగా భావించి పోషించేది రైతు మాత్రమే అని అందుకే రైతును భగవంతుడితో పోలుస్తారని ఆయన తెలిపారు. ప్లాస్టిక్ ను నివారించడం ద్వారా భూమి సాంద్రతను కాపాడవచ్చని, అంతేకాకుండా సేంద్రియ వ్యవసాయాన్ని వీలైనంత ఎక్కువమంది ప్రోత్సహించాలని, రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని, ఆ దిశగా దేశవ్యాప్తంగా ఉన్న నూతన ప్రయోగాలను సాయి రెడ్డి నేతృత్వంలోని కిసాన్ సంఘ కార్యకర్తలు విస్తృత ప్రచారం చేయాలని ఆయన సూచించారు. సమాజంలో ఎన్నో వృత్తులు వ్యవసాయం మీద ఆధారపడి ఉన్నాయని పరిస్థితులు, కాలము, ఆధునికత ఎన్ని వచ్చినా వ్యవసాయాన్ని విడిచి ప్రాణికోటి జీవించలేదు కాబట్టి ప్రతి ఒక్కరం వ్యవసాయాన్ని గౌరవించడంతోపాటు భూమిని కాపాడాల్సిన బాధ్యతను స్వీకరించాల్సిన అవసరం ఉందని ఆయన గుర్తు చేశారు. సాయి రెడ్డి లాంటి వినమ్రత కలిగిన కార్యకర్తలు, సిద్ధాంతాన్ని నమ్ముకొని పనిచేసిన కారణంగా అంచలంచలుగా ఎదిగి జాతీయ అధ్యక్షుడు కావటం గర్వకారణం అని తెలిపారు. రైతాంగం సమస్యలు, వ్యవసాయంలో వస్తున్న మార్పులను ప్రకృతికి అనుకూలంగా అనుసంధానం చేసే ప్రక్రియను రైతులకు తెలియజేయాలని, ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుంటూ అన్నదాతల యొక్క యశస్సును కాపాడాలని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షుడు కె.నారయణ రెడ్డి, జోనల్ కార్యదర్శి, భారతీయ కిసాన్ సంఘ్, ముఖ్య అతిథి కొండెల సాయ రెడ్డి, జాతీయ అధ్యక్షుడు, భారతీయ కిసాన్ సంఘ్, విశిష్ఠ అతిథి నార్రా వెంకట శివ కుమార్, ఇందూరు విభాగ్ ప్రచారక్, తెలంగాణ ప్రాంత సహ భౌద్దిక్ ప్రముఖ్ గౌరవ అతిథులు వీర స్వామి, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ వినయ్ కుమార్, రైతు ఉత్పత్తిదారుల సంఘం రాష్ట్ర ఫెడరేషన్ డైరెక్టర్ డి. వాసుదేవరావు, రైతు ఉత్పత్తిదారుల సంఘం స్టేట్ జనరల్ సెక్రటరీ గడ్డం దశరథ్ రెడ్డి, నగర అధ్యక్షులు, భారతీయ కిసాన్ సంఘ్, వ్యవసాయ శాఖ అధికారులు, భారతీయ కిసాన్ సంఘ నాయకులు కార్యకర్తలు వివిధ వ్యవసాయ అనుబంధ సంఘాలు, సహకార సంఘాల సభ్యులు, ఆత్మీయులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## సింగరేణి ఆధ్వర్యంలో మహిళలకు ఆటల పోటీలు



టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని పట్టణంలోని సిఈఆర్ క్లబ్బులో సింగరేణి ఆధ్వర్యంలో మహిళలకు మంగళవారం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏరియా సేవా అధ్యక్షురాలు జి స్వరూప దేవేందర్ ముఖ్య అతిథిగా హాజరై, ముందుగా మహిళలందరికీ ముందస్తు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ,అనంతరం పోటీలను ప్రారంభించారు.ఈసందర్భంగా మహిళలకు గ్లాస్ బాల్, బాల్ స్ట్రా, గ్లాస్ ఇన్ హెడ్, బాంబ్ ఇన్ బ్లాస్ట్ తదితర పోటీలు నిర్వహించగా,పోటీలలో ఏరియాలోని సుమారు 200 మంది మహిళలు,సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈసందర్భంగా సేవా అధ్యక్షురాలు స్వరూప దేవేందర్ మాట్లాడుతూ, ఈపోటీలో గెలుపొందిన మహిళలకు అంతర్జాతీయ మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలో బహుమతి ప్రధానోత్సవం చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కమ్యూనికేషన్ సెల్,సేవా సమితి కోఆర్డినేటింగ్ అధికారి, డివైపిఎం ఎండి అసిఫ్, మహిళా ఉద్యోగులు, సేవా సభ్యులు పాల్గొన్నారు.

## ప్రశ్నించే గొంతుకగా ఎమ్మెల్సీ కొమురయ్యను గెలిపించిన ఘనత ప్రతి ఉపాధ్యాయునిది

- కొమురయ్య గెలుపు కాంగ్రెస్ కు చెంప పెట్టు అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్త
- గెలుపు కోసం కృషి చేసిన తపస్ బాధ్యులను సన్మానించిన ఎమ్మెల్యే

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ





ఉపాధ్యాయుల సమస్యల పట్ల శాసనమండలిలో ప్రశ్నించే గొంతుకగా మల్కా కొమురయ్యను గెలిపించిన ఘనత ప్రతి ఉపాధ్యాయునికి దక్కుతుందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ప్రగతి నగర్ పాటిదార్ భావన్ లో నిర్వహించిన ఉపాధ్యాయ వందన కార్యక్రమానికి ఎమ్మెల్యే ధన్పాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు ఉపాధ్యాయ సమస్యల పట్ల శాసనస మండలిలో ప్రశ్నించే గొంతుకగా మొదటి ప్రాధాన్యతతో కొమురయ్యను గెలిపించిన ఘనత ప్రతి ఒక్క ఉపాధ్యాయునికి దక్కుతుందన్నారు. మేధావులైన ఉపాధ్యాయులు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక చెంప పెట్టు లాంటిది అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలు, హామీలు తుంగలో తొక్కి మాటలతో పూట గడుపుతున్న రేవంత్ సర్కార్ కు తగిన గుణపాఠం జరిగిందన్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల గెలుపే రేపు తెలంగాణలో బిజెపి ప్రభుత్వం ఏర్పడటానికి పునాది అవుతుందన్నారు. ఈ విజయంలో కష్టపడ్డ సంఘ నాయకులకు, బిజెపి కాషాయ కార్యకర్తలకు, ఉపాధ్యాయులకు మేధావులందరికి పాదాభివందనం తెలియజేసారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో కష్టపడి పని చేసి బిజెపిని గెలుపు దిశగా నడిపించిన ఉపాధ్యాయులను ఎమ్మెల్యే సన్మానించారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, కొండా ఆశన్న, రెంజర్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## అలీసాగర్ లిఫ్ట్ కెనాల్‌లో గుర్తుతెలియని వ్యక్తి శవం లభ్యం

టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి

ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ గ్రామం శివారులో అలీసాగర్ లిఫ్ట్ కెనాల్లో ఓగుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యమైంది.ఎడపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులో గల అలీసాగర్ లిఫ్ట్ కాల్వ తూము వద్ద ఓ 40 నుండి 45 సంవత్సరాల వయస్సు గల శవం పడి ఉండడాన్ని గమనించిన స్థానిక అలీసాగర్ లిఫ్ట్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు గజ ఈతగాళ్ల సహాయంతో శవాన్ని బయటకు తీయించారు.శవాన్ని పరిశీలించి గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి శవాన్ని నిజామాబాదు ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు.శవం కుళ్ళిపోయిన స్థితిలో ఉందని, మృతుడు 40-45 సం. ఉంటుందని ఎవరైనా తప్పిపోయి ఉంటే గానీ సదరు వ్యక్తి వివరాలు తెలిస్తే ఎడపల్లి పోలీసులకు తెలపాలని ఎస్సై వంశీ కృష్ణ రెడ్డి పేర్కొన్నారు..

# బాలికలు మంచి ఆహార నియమాలు పాటించాలి

జిల్లా జడ్జి సునీత కుంచాల...

టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి





బాలికలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించాలని, బాలికలు మంచి ఆహార నియమాలు పాటించడం ద్వారా మంచి ఆరోగ్యం పొందగలరని జిల్లా సెషన్ జడ్జి సునీత కుంచాల పేర్కొన్నారు .బోధన్ కు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయురాలు సరోజనమ్మ 9 సానిటరీ వెండింగ్ మెషిన్ లను బాలికల గురుకుల పాఠశాలలకు అందజేయడం జరిగిందని,వాటిని బోధన్ డివిజన్ లోని 9 బాలికల గురుకులాల ఉపాధ్యాయులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు.ఈమేరకు జిల్లా న్యాయ సేవఆధ్వర్యంలో ఎడపల్లి మండల కేంద్రం శివారులోని బాలికల గురుకుల పాఠశాల,కళాశాలలో న్యాయ చట్టాలపై, విద్యార్థినిలుకు నెలసరి సమస్యలు, రక్తహీనత, ఆహారంపై, చదువుపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.విద్యార్థినులు నెలసరి సమయంలో పరిశుభ్రత పాటించాలి అని తెలిపారు. నెలసరో సమయాల్లో మార్పులు ఉన్న,వేరే సమస్యలు కనబడుతున్న తల్లికిగానీ టీచర్లకు గాని వివరించి డాక్టర్ ని సంప్రదించాలని తెలిపారు. మంచి ఆహారం సమయానికి తీసుకుంటూ, సరైన సమయానికి నిద్ర పోవాలని, మానసిక ఒత్తిడిలుకి దూరంగా ఉండాలని తెలిపారు.రోజు వ్యాయామం చేయడం లాంటి మంచి నియమాలు వల్ల మెరుగైన ఆరోగ్యంతో పాటు అనారోగ్యం, రక్తహీనత లాంటి ప్రధాన సమస్యలు నుండి దూరం కావచ్చని తెలిపారు.నెలసరి సమయం లో పరిశుభ్రత చాలా అవసరమని,మంచి ఆహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత తగ్గుతుందని అన్నారు. ప్రతి ఒక్కరికి గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై అవగాహన పూర్తి కలిగి ఉండడం వల్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే తల్లిదండ్రులుకి గాని, ఉపాధ్యాయులుకి కానీ తెలియజేయాలని తెలిపారు. మంచి స్నేహాలు చేస్తూ మంచి ఆలోచనలు కలిగి ఉండాలన్నారు. అంతేకాకుండా న్యాయ చట్టాలపైప్రతీ ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని, కష్టపడి చదవడం కంటే ఇష్టపడి చదవాలని బాలికలు మనోదైర్యన్ని కోల్పోకుండా ఉన్నతస్థానాలను చేరుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జిలు పూజిత, పద్మావతి, రవికుమార్, రిటైర్డ్ టీచర్ సరోజనమ్మ, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ గంగాశంకర్, పాఠశాల, రూరల్ సీఐ విజయ్ బాబు,ఎస్సై వంశీ కృష్ణ రెడ్డి, కళాశాల సిబ్బంది,బోధన్ పరిధిలోని 9గురుకులాల టీచర్లు తదితరులు ఉన్నారు.

## భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ అధ్యక్షుడు సాయి రెడ్డికి ఆత్మీయ సన్మానం

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ



దేశంలోనే అతిపెద్ద రైతు సంస్థ భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ అధ్యక్షునిగా ఎన్నికైన మొట్టమొదటి తెలంగాణ వాసి కొండల సాయి రెడ్డిని భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మాదాసు స్వామి యాదవ్, మాజీ నగర అధ్యక్షుడు ఎండల సుధాకర్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. బాల్యం నుంచి ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా తన ప్రయాణాన్ని ప్రారంభించిన సాయి రెడ్డి అంచలంచలుగా ఎదిగి దశాబ్దాల పోరాటానికి ఫలితంగా నేడు జాతీయ అధ్యక్షునిగా ఎన్నిక కావడం మన జిల్లాకే గర్వకారణం అని ఈ సందర్భంగా స్వామి యాదవ్ తెలిపారు. భారతీయ కిసాన్ సంఘ్ 46వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో సాయి రెడ్డి సేవలను స్వామి యాదవ్ కొనియాడారు.సాయి రెడ్డి నేతృత్వంలో దేశంలోని అన్ని గ్రామాలకు భారతీయ కిసాన్ సంఘ్ విస్తరించాలని ఆకాంక్షించారు.

## ఘౌస్ అకాల మరణం పట్ల వైద్య సిబ్బంది సంతాపం



టైమ్స్ ఆఫ్ వార్త చింతకాని

చింతకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కోడుమూరు ఉపకేంద్రము నందు రెండవ ఆరోగ్య కార్యకర్తగా పనిచేస్తున్న ఆర్ ఘౌస్ అకాల మరణం పట్ల చింతకాని వైద్య సిబ్బంది అందరూ ఆషా డే కార్యక్రమమునందు సంతాపం వ్యక్తం చేస్తూ వారికి వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తున్న మండల వైద్యాధికారి డాక్టర్ అల్తాఫ్ మరియు సాయికుమార్ సూపర్వైజర్లు రేచల్రాణి, వీరేందర్, నాగేశ్వరావు, కృష్ణారావు ,సైదులు, ఉదయ్ కుమార్ సునీల్ , మండల వైద్య సిబ్బంది మరియు ఆశాలందరూ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసినారు.

## పోచంపాడ్ పీహెచ్సీ ని తనిఖీ చేసిన కలెక్టర్



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్/ మెండోరా

నిజామాబాద్ జిల్లాలోని మెయిన్ డోరా మండలం లోగల పోచంపాడ్ పిహెచ్సిని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తనిఖీ చేశారు.ఆయా విభాగాలను సందర్శించి, రోగులకు అందిస్తున్న వైద్య సేవల తీరును గమనించారు.మందుల స్టాక్, వైద్యులు, సిబ్బంది హాజరును తనిఖీ చేశారు.వివిధ వార్డులను సందర్శించి రోగులకు కల్పిస్తున్న సదుపాయాలను గమనించారు. బ్లడ్ శాంపిల్స్ సేకరిస్తూ,మధుమేహం, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధుల నిర్ధారణ, వాటి బారిన పడిన వారికి అందిస్తున్న చికిత్సల గురించి అడిగి తెలుసుకున్నారు.అన్ని రకాల ఔషధాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల ఇంచార్జ్ జోనల్ ఆఫీసర్ పూర్ణచందర్, స్కూల్ ప్రిన్సిపాల్ గోదావరి, పీ.హెచ్.సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాకేశ్ తదతరులు ఉన్నారు.

since: 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com



# ఎడపల్లి సబ్ స్టేషన్లో ఘనంగా లైన్ మెన్ దివస్





టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి

విద్యుత్ పంపిణీకి వెన్నెముకగా నిలిచే లైన్‌మెన్, గ్రౌండ్ మెయింటెనెన్స్ సిబ్బంది అంకిత భావం సేవలను గుర్తించడానికి లైన్‌మెన్ దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఏడీఈ ప్రభాకర్ పేర్కొన్నారు.మంగళవారం ఎడపల్లి మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్లో విద్యుత్ సిబ్బందితో కలిసి లైన్‌మెన్ దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మండలంలో పనిచేస్తున్న లైన్ మెన్లను, విద్యుత్ సిబ్బందిని ఏడీఈ ప్రభాకర్, ఏఈ కిషోర్ రెడ్డిలు శాలువాలతో సన్మానించారు.ఈ సందర్భంగా ఏడీఈ ప్రభాకర్ మాట్లాడుతూ.. .లైన్ మెన్ లు దేశంలో ఉజ్వల భవిష్యత్తును శక్తివంతం చేయడంలో ప్రముఖ పాత్ర వహిస్తారని, లైన్‌మన్ దివస్ వారి అమూల్య మైన పాత్రకు నిదర్శనమని అన్నారు."విద్యుత్ సరఫరాను త్వరగా పునరుద్ధరించడం,విద్యుత్ లైన్ల మరమ్మత్తులు, నిర్వహణ, డిస్‌కనెక్ట్ చేయబడిన వైర్లు, విద్యుత్ వైఫల్యాలు, కొత్త కనెక్షన్‌లను అందించడం మొదలైన వాటి కోసం అత్యవసర సమయాల్లో లైన్‌మెన్ సకాలంలో చర్యలు తీసుకుంటున్నారన్నారు. లైన్‌మెన్ల అనివార్య సహకారాలను గౌరవించడానికి ఇలాంటి దివస్లను నిర్వహించడం గర్వించదగ్గ విషయమన్నారు. మన దేశ విద్యుత్ మౌలిక సదుపాయాల సజావుగా పనిచేయడానికి అవిశ్రాంతంగా పనిచేసే ఈ ఫ్రంట్‌లైన్ హీరోల అంకితభావంతో తాము కలిసి ఉన్నామన్నారు.దేశం యొక్క ఉజ్వల భవిష్యత్తు వైపు ప్రయాణాన్ని శక్తివంతం చేయడంలో వారి అమూల్యమైన పాత్రకు లైన్‌మన్ దివస్ నిదర్శనంగా మారుతుంది.ఈ కార్యక్రమంలో సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ శంకర్ నాయక్, సత్యనారాయణ,పాషా, లైన్మెన్లు పవన్, సాయిబాబా, బాలరాజు,గజానంద్,గంగయ్య,విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అత్యుత్తమ సంస్థలుగా సింగరేణి సంస్థలు

## సింగరేణి ఎడ్యుకేషనల్ కార్యదర్శి జి శ్రీనివాస్

టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-



సింగరేణి విద్యాసంస్థలను సింగరేణి సిఎండి ఎన్ బలరాం ఆదేశానుసారం అత్యుత్తమ సంస్థలుగా తీర్చిదిద్దడానికి అడుగులు వేస్తున్నామని సింగరేణి ఎడ్యుకేషనల్ కార్యదర్శి జి శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని సింగరేణి ఉన్నత పాఠశాల 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం నిర్వహించిన సిల్వర్ జూబ్లీ వేడుకలకు ఆయన ఏరియా జిఎం జి దేవేందర్ తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంగళవారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సింగరేణి విద్యాసంస్థలలో తొమ్మిది పాఠశాలలు, ఒక మహిళ జూనియర్ కళాశాల, ఒక మహిళ డిగ్రీ, పీజీ కళాశాల, ఒక పాలిటెక్నిక్ కళాశాలలో మొత్తం 7642 విద్యార్థులతో విజయవంతంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికై అకాడమిక్స్, క్రీడలు, అథ్లెటిక్స్, మ్యూజిక్, ఎన్సిసి, స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యను అందించాలనే ఉద్దేశ్యంతో యోగ, ద్యానం నేర్పించడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా అధ్యాపకులకు, ఆచార్యులకు ఫ్యాకల్టీ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామన్నారు. అధ్యాపకులను వివిధ సంస్థలకు పంపి, అక్కడ మంచి పద్ధతులను తెలుసుకొని, మన విద్యాసంస్థల్లో ఆచరణ పెట్టడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు. సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్పీటీఈఎల్ చాప్టర్ ను ప్రారంభించి, విద్యార్థులను, అధ్యాపకులను అనేక కోర్సులలో నమోదు చేయించడం జరిగిందన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను సింగరేణి మహిళ డిగ్రీ కళాశాలకు న్యాక్ అక్రిడేషన్ రావడానికి పూర్తి ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలలో కొత్త కోర్సులు ప్రవేశపెట్టబోతున్నామని, పాలిటెక్నిక్ కళాశాలలో ఏఐఎంఎల్ అనే కొత్త కోర్సును ప్రవేశపెడుతున్నామని, దీనితో విద్యార్థులకు అనేక అవకాశాలు వస్తాయని తెలిపారు. అదేవిధంగా పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్బీఏ అక్రిడేషన్ కొరకు దరఖాలు చేసుకోవడం జరుగుతుందన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఐఐటి, జేఈఈ, నీట్, బిట్సాట్ పరీక్షలపై అవగాహన, కోచింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. గోదావరి గాని సెక్టార్ త్రీ సింగరేణి పాఠశాలలో సీబీఎస్ఈ సిలబస్ లో ఈ సంవత్సరం ప్రారంభించనున్నామన్నారు. పాఠశాల విద్యార్థులు తల్లిదండ్రులతో పేరెంట్స్ అండ్ టీచర్స్ సమావేశం నిర్వహించి, గైర్హాజరు నివారించడం, సమయపాలన పాటించడం తదితర అంశాలను వివరించడం జరుగుతుందని, అదేవిధంగా వారిని మంచి శిక్షణ పద్ధతులు, లైఫ్ స్కిల్స్, కమ్యూనికేషన్ ఎలా ఇవ్వాలో అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. పాఠశాల విద్యార్థులకు సైన్స్ ఫెయిర్, సైన్స్ ఎగ్జిబిషన్, ఎడ్యుకేషన్ టూర్ లకు తీసుకువెళ్ళాడం, విద్యార్థులపై ఎప్పటికప్పుడు ప్రత్యేక శ్రద్ధ వహించడం జరుగుతుందన్నారు. సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినీలు, అధ్యాపకులు ఇస్రో స్టార్ట్ ప్రోగ్రాంలో పాల్గొనడం జరిగిందని, సింగరేణి విద్యార్థిని విద్యార్థులు దేశ ప్రధానమంత్రి పరీక్ష పే చర్చ అనే కార్యక్రమం పాల్గొన్నారని, అదే విధంగా సింగరేణి పాఠశాల విద్యార్థి విద్యార్థులు మొదటిసారిగా సైన్స్, మ్యాథ్స్ ఒలింపియాడ్స్ లో పాల్గొన్నారని, ఇటీవల నిర్వహించిన సీఎం కప్ క్రీడలలో సుమారు 500 మంది సింగరేణి విద్యార్థులు పాల్గొన్నారని గుర్తు చేశారు.పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, ప్రత్యేక దృష్టి సాధించడం జరుగుతుందని, అందులో భాగంగా వారికి అల్పాహారం, స్నాక్స్ అందజేయడం తెలిపారు. సింగరేణి మహిళ డిగ్రీ కళాశాల 50 వసంతాలు పూర్తిచేసుకుని, స్వర్ణోత్సవాలు జరుపుకోబోతున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో నస్పూర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ నరసింహస్వామి, సిసిసి సింగరేణి పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంతోష్ దేశాయ్, పట్టణ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జే పురుషోత్తం, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సిద్దాపూర్ తాండ లో వివాహ వేడుకలో పాల్గొన్న సెంట్రల్ ప్రిసన్ సూపరింటెండెంట్



టైమ్స్ అఫ్ వార్త -గాంధారి

వర్ని మండలంలోని సిద్దాపూర్ తాండలో జరిగిన ఓ వివాహ వేడుక అందరి దృష్టిని ఆకర్షించింది. ఎందుకంటే, ఆ వేడుకకు ప్రత్యేక అతిథిగా సెంట్రల్ ప్రిజన్ సూపరింటెండెంట్ ఆనందరావు గారు హాజరయ్యారు.తన ప్రిజన్ సిబ్బంది బామన్ వేణుగోపాల్ గారి వివాహ వేడుకలో పాల్గొనడం కోసం ఆయన స్వయంగా విచ్చేశారు. ఇది ఆయన సిబ్బంది పట్ల చూపించే ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనంగా నిలిచింది.వధూవరులను మనస్ఫూర్తిగా ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఆనందరావు గారి రాకతో వేడుకకు మరింత కళ వచ్చింది. ఆయన సిబ్బంది పట్ల చూపిన ఈ ఆత్మీయత అందరినీ ఆకట్టుకుంది.ఈ కార్యక్రమం లో తన తోటి సిబ్బంది కూడా పాల్గొనడం జరిగింది.

# ప్రణాళికతో చదివితే విజయం సాధ్యం...

## మండల విద్యాధికారి డి. చందర్...




టైమ్స్ ఆఫ్ వార్తు- బాన్సువాడ:

విద్యార్థులు సరైన ప్రణాళికతో చదివితే విజయం సాధించవచ్చని మండల విద్యాధికారి డి. చందర్ అన్నారు. బాన్సువాడ నియోజకవర్గం నసుల్లాబాద్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన ఫేర్వెల్ పార్టీలో ఆయన పాల్గొని మాట్లాడారు. పూర్వ విద్యార్థి కానిస్టేబుల్ సాయిలు తోపాటు 20019- 20 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు సైతం విద్యార్థులు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, బహుకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు, పాల్గొన్నారు.

# ఏఐ ద్వారా విద్యార్థులకు సులభతరంగా విద్యా బోధన

## జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

టైమ్స్ ఆఫ్ వార్త - ఖమ్మం



సర్కారు బడిలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (కృత్రిమ మేధ)ను వినియోగిస్తూ విద్యార్థులకు సులభతరంగా విద్యా బోధన చేసేందుకు చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.మంగళవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ 53వ డివిజన్ ఎన్.ఎస్.పి. కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఏ.ఐ. విద్యా బోధనను పరిశీలించి, ఏ.ఐ. విద్యా బోధనకు అవలంబిస్తున్న పద్ధతులను తెలుసుకున్న కలెక్టర్ ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏ.ఐ.) ను వినియోగిస్తూ విద్యార్థులను ఆకట్టుకునేలా సులభ రీతిలో బోధన ప్రారంభించాలని అన్నారు. విద్యార్థులకు మంచి లెర్నింగ్ ఎక్స్పీరియన్స్ దక్కేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో ప్రాథమిక పాఠశాల విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పెంచేందుకు ఏ.ఐ. సహాయంతో నూతన బోధన పద్ధతులను ప్రవేశపెట్టిందని, మన ఖమ్మం జిల్లాలో 7 ప్రభుత్వ పాఠశాలల్లో ముందస్తుగా పైలెట్ ప్రాజెక్టు క్రింద ఏ.ఐ. విద్యా బోధనను ప్రారంభిస్తున్నామని, ఖమ్మం అర్బన్ ప్రాంతంలో నాలుగు పాఠశాలలు, నేలకొండపల్లి మండలం సింగిరెడ్డి పాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, సత్తుపల్లి మండలంలోని సిద్ధారం, ఎన్టీఆర్ నగర్ లలో ప్రాథమిక పాఠశాలలో ఈ బోధన ఏర్పాటు చేశామని అన్నారు.ఏ.ఐ. కోర్సు ప్రతి విద్యార్థికి ప్రత్యేకంగా ఉంటుందని, విద్యార్థి సామర్థ్యాన్ని అంచనా వేస్తూ దానికి అనుగుణంగా బోధన జరిగేలా ఏ.ఐ. కోర్సులు రూపొందించడం జరిగిందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి వరకు చదివే విద్యార్థులకు కనీస అభ్యాస సామర్థ్యాలు పెంచేలా ఏ.ఐ. ను వినియోగించడం జరుగుతుందని, పిల్లలు తెలుగు, ఆంగ్లం బాగా చదివి, రాసేలా, గణిత అంశాల్లో పట్టు సాధించేలా చూడడమే ఈ కార్యక్రమం లక్ష్యమని అన్నారు. ప్రభుత్వ ప్రాథమిక ఎన్.ఎస్.పి. పాఠశాలలో 3 నుండి 5వ తరగతిలో వెనకబడిన ప్రతి 10 మంది విద్యార్థులను ఎంపిక చేసి, ప్రస్తుతం తెలుగు, గణితంలో ఏ.ఐ. ద్వారా పాఠాలను బోదించడం జరుగుతుందని అకడమిక్ మానిటరింగ్ అధికారి రవి కుమార్ కలెక్టర్ కు వివరించారు.అనంతరం జిల్లా కలెక్టర్ పాఠశాలల్లో ఏఐ పాఠాలు నేర్చుకుంటున్న చిన్నారులతో ముచ్చటించారు. లిపిల్లలతో ఏ.ఐ. ద్వారా తెలుగు చదివించి వాటి అర్థం అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి కె. రవి కుమార్, ఎం.ఈ.ఓ. శైలజా లక్ష్మి, జి.సి.డి.ఓ. తులసి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బుర్రి వెంకన్న, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

# బిజెపి గెలుపును ఆపలేరు

## బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్

## మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు అమిరిశెట్టి రాజ్ కుమార్



టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-

కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి నాయకులు మీద కేసులు పెట్టి, ఇబ్బందులకు గురిచేసిన బిజెపి గెలుపును ఆపలేకపోయారని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు అమిరిశెట్టి రాజ్ కుమార్ లు తెలిపారు.ఇటీవల జరిగిన ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల్లో సోమవారం వెలువడగా ఈ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి మల్కా కొమరయ్య ఘనవిజయం సాధించడంతో మంగళవారం జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నాయకులు దుర్గం అశోక్, రాజ్ కుమార్ ల ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టపాసులు కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ పార్టీ అభ్యర్థి మల్క కొమురయ్య ను భారీ మెజారిటీతో గెలిపించిన ఉపాధ్యాయులందరికీ పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలలో పోలింగ్ కేంద్రాల వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్ని ఇబ్బందులకు గురి చేసినా, బీజేపీ కార్యకర్తలపై దాడి చేసి, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లితో సహా ఆరుగురు బీజేపీ కార్యకర్తలపై నాలుగు నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసిన, బీజేపీ కార్యకర్తలు వెనుక అడుగు వేయకుండా, బీజేపీ పార్టీ గెలుపు కోసం కృషి చేశారని తెలిపారు. నేడు మేధావి వర్గం బీజేపీ వైపు ఉన్నారని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కేవలం బీజేపీ పార్టీ తోనే సాధ్యమనే ఉద్దేశ్యంతో నేడు ఉపాధ్యాయులు బీజేపీ పార్టీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం, ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకుండా, వారికి అందాల్సిన పీఆర్సీ, డీఏ లు, ఇతర బకాయిలు చెల్లించకుండా మోసం చేసిందని ఆరోపించారు. జిఓ నెంబర్ 317తో ఉపాధ్యాయులు వారి కుటుంబాలకు దూరం అయిత, వారి పక్షాన అప్పటి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ జిఓ నెంబర్ 317ను రద్దు చేయాలని దీక్షలు, ధర్నా చేస్తే, అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం బండి సంజయ్, బీజేపీ కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేసిన, ఉపాధ్యాయుల పక్షాన పోరాటంలో వెనకడుగు వేయలేదని గుర్తు చేశారు. ఉపాధ్యాయులు అందించిన భారీ విజయంతో ఇదే స్ఫూర్తితో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి పార్టీ భారీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు జోగుల శ్రీదేవి, ముదాం మల్లేష్, జయరామ రావు, కంకణాల సతీష్, పచ్చ వెంకటేశ్వర్లు, బూర్ల చిరంజీవి, బల్ల రవి, అనిల్, ఆవిడపు రాజ్ కుమార్, అర్ణకొండ శ్రీనివాస్, అనిల్, నరేందర్, రాజమౌళి, రవీందర్ లు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-

పట్టణంలోని పాత బస్టాండ్ బురదగుడం సమీపంలోని దొర గారి తోటలో నిర్మించిన శ్రీశ్రీశ్రీ త్రిశక్తి అష్టలక్ష్మి కామాఖ్య దేవాలయంలో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మంగళవారం ఆలయ ప్రాంగణంలో విగ్రహమూర్తులకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి సతీష్ భవాని మాట్లాడుతూ, పట్టణంలో నూతనంగా నిర్వహించిన కామాఖ్య ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. మహాశివరాత్రి పర్వదినం నుండి ఆరు రోజులపాటు తాంత్రిక సాంప్రదాయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించగా, మరో మూడు రోజులు వైదిక సంప్రదాయంలో పూజలు నిర్వహించి, విగ్రహ ప్రతిష్టాపన నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. దీనిలో భాగంగా మంగళవారం నుండి వైదిక సాంప్రదాయంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై, పూజా కార్యక్రమాలలో పాల్గొనాలని కోరారు. మార్చి 6న బ్రహ్మ ముహూర్తనా ఆలయంలో యంత్ర ప్రతిష్టాపన, విగ్రహ ప్రతిష్టాపన, ధ్వజస్తంభ స్థాపన, అనంతరం మహా కుంభాభిషేకం, మహా పూర్ణాహుతి, బలి ప్రధానం అనంతరం అన్న సంతర్పణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాలుపంచుకోవడం ఎంతో పుణ్యకార్యమని, మూడు రోజులపాటు అత్యంత వైభవంగా భక్తి ప్రపత్తులతో నిర్వహించనున్న ఈ కార్యక్రమాలకు పట్టణ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారి అనుగ్రహానికి పాత్రులు కాగలరని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పిడిఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్న టాస్క్ పోర్స్ పోలీసులు

టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-

ఆటోలో అక్రమంగా రవాణా చేస్తున్న 30 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని టాస్క్ పోర్స్ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ సిఐ రాజ్ కుమార్, టాస్క్ ఫోర్స్ ఎస్ఐ లచ్చున్న లు మాట్లాడుతూ, రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్, ఐపీఎస్, ఐజి ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ సిబ్బంది జిల్లాలోని తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బోయపల్లి బోర్డు వద్ద బెల్లంపల్లి నుండి తాండూర్ వైపుగా వెళ్తున్న ఆటో (టిఎస్ 15 యుఇ 2353) తో పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులో తీసుకొని, ఆటోల తరలిస్తున్న 30 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. మరో నిందితుడు తాండూర్ తంగళ్ళపల్లి చెందిన గోవిందుల శ్రీనివాస్ పరారీలో ఉన్నారన్నారు. ఈ మేరకు నిందితులు తాండూర్, తంగెళ్ళపల్లికి చెందిన దుర్గం శ్రీకాంత్, బుల్లి చందు, కనుగుల తిరుపతి లపై కేసు నమోదు చేసి, స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని, నిందితులను తదుపరి విచారణ నిమిత్తం తాండూర్ పోలీస్ స్టేషన్ కు అప్పగించారని తెలిపారు.



TIMES OF VARTHA (05-03-2025)MA_times of varha main (13-2).qxd 3/5/2025 6:05 AM Page 5



since 2007
# టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com



## మార్చి 8ని మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా జరపండి

### పి ఓ డబ్ల్యు పిలుపు.

టైమ్స్ ఆఫ్ వార్త చింతకాని

అంతర్జాతీయ మహిళా పోరాట దినం ఆవిర్భవించి 114 సంవత్సరాల అయిందని ఈ సందర్భంగా మార్చి 8న జిల్లా వ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న దాడులు పరువు హత్యలకు అత్యాచారాలకు వ్యతిరేకంగా సభలు ప్రదర్శనలు జరపాలని పిఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ శిరోమణి, పిఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల మంగతాయి, జిల్లా సహాయ కార్యదర్శ ప్రతాపనేని శోభ పిలుపు నిచ్చారు. చింతకాని మండలం నాగులవంచ గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా కొల్లేటి వసంత అధ్యక్షతన సభ జరిగింది, ఈ సభలో పి ఓ డబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ శిరోమణి, పి ఓ డబ్ల్యు జిల్లా కార్యదర్శి ఆవుల మంగతాయి, పి ఓ డబ్ల్యు జిల్లా సహాయ కార్యదర్శి ప్రతాపనేని శోభ, మాట్లాడుతూ మహిళలు తమ రక్తాన్ని చిందించి హక్కులు సాధించుకున్న రోజును అంతర్జాతీయ మహిళా పోరాట దినంగా మార్చి 8ని జరపాలని వారన్నారు,ఒకవైపు స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాల అయినా మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన చెందారు, మహిళలపై జరుగుతున్న అణిచివేత వివక్షత అసమానత్వానికి వ్యతిరేకంగా మహిళలు పోరాడాలని వారు కోరారు. తెలంగాణ రాష్ట్రంలో నిత్యం మహిళలపై అత్యాచారాలు పరువు హత్యలు చేస్తున్న దౌర్భాగ్య




పరిస్థితి ఉన్నదని వారన్నారు . బిల్కిస్ భాను ఘటనకు బాధ్యులైన దోషులను బిజెపి వారు సత్కరించటం మహిళలపై వారికున్న గౌరవాన్ని చాటుకున్నారని వారన్నారు దేశంలో రాష్ట్రంలో పరువు హత్యలు జరుగుతున్న ఇటీవల ప్రేమ యుహాలు చేసుకున్న మహిళా కానిస్టేబుల్ ని తమ్ముడే హత్య చేయటం దుర్మార్గమైన చర్యని వారి ఆరోపించారు మధ్యప్రదేశ్ రాజస్థాన్ రాష్ట్రాల్లో బాలికలపై హత్యాచారం చేసి హత్యలు చేస్తున్న పరిస్థితి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఉన్నదని వారు ఆరోపించారు హిందువులు మాత్రమే ఈ దేశంలో ఉండాలని గౌకేకలు వేస్తున్న బిజెపి వారు దైవ దర్శనానికి వెళ్లిన దంపతులు సేద తీరుతుండగా భర్త ఎదుటినే భార్యపై అఘాయిత్యం చేసి హత్య చేయడం నీతి భయమైన చర్యని వారన్నారు. మహిళలపై నేరం క్షమించరాని పాపమని నేరగాళ్లకు కఠిన శిక్షలు తప్పవని ప్రధాని మోదీ హెచ్చరికలు చేయటమే తప్ప, వారి పరిపాలిస్తున్న రాష్ట్రాల్లో నిత్యం మహిళలను అత్యంత దారుణంగా హత్యలు చేస్తుంటే మోడీ ప్రభుత్వం ప్రజల నమ్మించడానికి ఇలాంటి ప్రకటనలు చేస్తున్నాడని వారు అన్నారు .చట్టాలు అధికారంలో ఉన్న వారికి చుట్టాలుగా మారాయి తప్ప మహిళలకు ఎటువంటి రక్షణ లేదని వారన్నారు. కావున ఈనెల 8న ఖమ్మంలో రామ నర్సయ్య విజ్ఞాన కేంద్రంలో పిఓడబ్ల్యూ ఆధ్వర్యంలో జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సభలో కారుమంచి సుజాత, షేక్ హుస్సేన్ బి ,జొన్నలగడ్డ వెంకట్రామమ్మ ,మొర్రి మేకల చుక్కమ్మ ,మొర్రిమేకల లింగమ్మ, నాగేంద్ర ,మట్టి మంగతాయి ,చిత్రాభారతి, పడిశాల లక్ష్మి ,ఉన్నం ఉమా, పున్నం చిట్టి

## బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం..

టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-



జాతీయ భద్రత దినోత్సవం సందర్భంగా అప్రమత్తత మన ధ్యేయం సురక్షితమైన సమాజం మన లక్ష్యంతో భద్రత కల్పిస్తారని స్మరిస్తూ, జిల్లాలోని బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం సనాతన ధర్మ బాయిజమ్మ సాయి భక్తి ప్రచార ధార్మిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ గుప్తదాత సహకారంతో గర్భిణులకు బాలింతలకు, డయాలసిస్ రోగులకు, అన్నార్తుల కు సాయి భోజన్ అన్నదానం చేసినట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు, ప్రముఖ విద్యావేత్తలు డాక్టర్ కాంపల్లి శంకర్ , రాజేశ్వరి లు తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని, గర్భిణీలు, బాలింతలు, రోగులు, అన్నార్తులు, ఆసుపత్రి సిబ్బంది, సాయి భోజన్ అందజేశారు. ఈసందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కాంపల్లి శంకర్, రాజేశ్వరి లు మాట్లాడుతూ, ట్రస్ట్ ద్వారా ఆకలితో ఉన్నవారిని అతిథి సత్కారంతో ఆదరించి, అన్నదానంతో తృప్తి పరుచుద్దామని పిలుపునిచ్చారు. సేవే లక్ష్యం, సేవే మార్గంతో ట్రస్ట్ కొనసాగుతుందని,మానవ సేవే మాధవ సేవ అని త్రవిద్య, శ్రవిద్య, త్రయాక్షర్ అని తెలిపారు. బాయిజమ్మసాయి సేవా ట్రస్ట్ ద్వారా అన్నదానం, సాయం అందించాలని అనుకునేవారు ట్రస్ట్ మేనేజర్ 8106550532, ఫౌండర్స్ 9959269975, 9949041595 సెల్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమములో ట్రస్ట్ మేనేజర్ బొద్దున సతీష్, సభ్యులు,జేరిపోతుల చంద్రకళ, సేవకులు ఆటో యూనియన్ అధ్యక్షుడు కట్ట రామ్ కుమార్,ఆర్ఎంపి వైద్యుడు పేరం రమేష్, ఆరెల్లి కుమార్, పోతరాజుల తిరుపతి, ఎండి యూసఫ్, ఎస్డి జిలాని, ఎస్డి షహీన్, కాడపాక మహేందర్ లు పాల్గొన్నారు.

## ప్రమాదాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది

### బెల్లంపల్లి ఏసిపి ఏ రవికుమార్

టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-



రోడ్డు నిబంధనలు పాటిస్తూ, ప్రమాదాలు అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బెల్లంపల్లి ఏసిపి ఏ రవికుమార్ తెలిపారు. 54వ జాతీయ భద్రత వారోత్సవాలు-2025 ను పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని టోల్ గేట్ వద్ద జాతీయ రహదారి అధికారులు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశమైన ఏసిపి ఏ రవికుమార్ మాట్లాడుతూ, 54వ జాతీయ భద్రత వారోత్సవాల ప్రాముఖ్యతను తెలియజేశారు. భద్రతపై అవగాహన పెంచడానికి, ప్రమాదాలను తగ్గించడానికి 1971లో నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్సి) ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందని, ప్రతి సంవత్సరం మార్చి 4న జాతీయ భద్రత దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. పోలీసులు ఆధ్వర్యంలో రహదారి భద్రత గురించి ఎన్నో అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన గత సంవత్సరం బెల్లంపల్లి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో గల జాతీయ రహదారి 363 మీద జరిగిన రోడ్డు ప్రమాదాలలో 54 మంది మరణించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి సమయంలో రహదారులపై వాహన నిలిపి ఉంచడం వల్ల ప్రమాదాలు ఎక్కువ జరిగే అవకాశం ఉందని తెలిపారు. వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై నిరంతరం అవగాహన కల్పిస్తున్నామని, సంబంధిత అధికారులు ప్రమాదల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సిఐ కే శశిధర్ రెడ్డి, పట్టణ ఎస్ఐ ఎస్ రాజశేఖర్, కాసీపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్, జాతీయ రహదారి నిర్వహణ అధికారి సునీల్, సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## వరిధాన్యం కొనుగోలు కొరకు ముందస్తు ఏర్పాట్లు

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-

ప్రభుత్వ ఆదేశాల మేరకు వరిధాన్యం కొనుగోలు కొరకు రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా గ్రామీణాభివృద్ధి, బ్యాంకింగ్, పౌరసరఫరాలు, వ్యవసాయ, సహకార, రవాణా, మార్కెటింగ్ శాఖల అధికారులు, మెప్మా అధికారులతో కలిసి రైస్ మిల్లుల సంఘం ప్రతినిధులు, అధికారులతో యాసంగి 2024-25 వరిధాన్యం కొనుగోలుపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, రైతుల సంక్షేమం కోసం, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, నిబంధనల మేరకు రైతుల నుండి నాణ్యమైన వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. యాసంగి 2024-25 సంవత్సరానికి గాను గ్రేడ్ ఏ రకానికి రూ.2320లు, సాధారణ రకానికి రూ.2300లు మద్దతు ధర నిర్ణయించడం జరిగిందన్నారు. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో కొనుగోలు ప్రక్రియకు కావలసిన తూకం యంత్రాలు, తేమ శాతం మీటర్లు, ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్ల కొరకు టెండర్లు ఆహ్వానించి, కొనుగోలు చేయాలన్నారు. వ్యవసాయ శాఖ పరిధిలో సన్నరకం, దొడ్డురకం గుర్తించి, ధృవీకరణ పత్రం అందించాలని, పంట కోత సమయంలో హార్వెస్టర్ నియంత్రణ వ్యవసాయ విస్తరణ అధికారులు చేపట్టాలని సూచించారు. తూనికలు, కొలతల శాఖ చే పరీక్షించబడి, ధృవీకరించబడిన తూకం యంత్రాలను మాత్రమే కొనుగోలు ప్రక్రియలో వినియోగించాలని, కొనుగోలు కేంద్రాలలో మాన్యువల్ తూకం జరుగకుండా, డిజిటల్ తూకం యంత్రాలతో కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్యాడీ క్లీనర్లు అవసరమైన చోట ఏజెన్సీల ఆధ్వర్యంలో విద్యుత్ సౌకర్యం లేని కొనుగోలు కేంద్రాలలో తాత్కాలిక మీటర్లు ఏర్పాటు చేసుకొని, వినియోగించాలని సూచించారు. గన్నీ సంచుల నిర్వహణ పక్కదారి పట్టకుండా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. బెల్లంపల్లి, చెన్నూర్ ప్రాంతాలలో వరిధాన్యం పంట కోత ఆలస్యంగా ఒకేసారిగా వచ్చే అవకాశం ఉన్నందున రవాణా ప్రక్రియలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, జిల్లా మార్కెటింగ్ అధికారి షహబొద్దీన్, జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు నల్మాసు కాంతయ్య, నాయకులు చిలువేరు వైకుంఠం, చిలువేరు శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బాన్సువాడ బిజెపి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు వందనం మహోత్సవ వేడుకలు

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:



ఉమ్మడి కరీంనగర్ నిజామాబాద్ ఆదిలాబాద్ మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా చారిత్రాత్మక విజయాన్ని సాధించిన మన అభ్యర్థి మల్క కొమురయ్య విజయం సాధించిన సందర్భంగా బాన్సువాడలోని దేశాపేట్ లోని ఎస్ ఆర్ ఎన్ కె డిగ్రీ కాలేజ్ లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొనబాన్సువాడలోఉపాధ్యాయులకు వందనం" మహోత్సవ వేడుకలు చేయటం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ నిజాంబాద్, అదిలాబాద్, మెదక్, కరీంనగర్, ఉమ్మడి జిల్లాలో టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమురయ్య భారీ మెజార్టీతో మొదటి ప్రాధాన్యత ఓటుతోగెలిపించినఉపాధ్యాయులందరికీపేరుపేరునాధన్యవాదాలు తెలియజేస్తూ బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల కళాశాలల ఉపాధ్యాయులకు లెక్చర్లకు కలిసి ధన్యవాదాలు తెలియజేస్తూ మిఠాయిలు పంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి అసెంబ్లీ పట్టభద్రుల ఇంచార్జ్ పోతుల బొగడ శ్రీనివాస్ రెడ్డి, బిజెపి జిల్లా కార్యదర్శి పయ్యాల శంకర్ గౌడ్, బిజెపి రూరల్ అధ్యక్షులు మజ్జిగ శ్రీనివాస్, బీజేపీ నాయకులు కోణాలగంగారెడ్డి,హనుమాన్లు,చీకట్ల రాజు, శివశంకర్, శంకర్, డిజె సాయి, సాయి రెడ్డి ,దత్తు, సాయి ప్రసాద్, శివకుమార్, లక్ష్మణ్, రామకృష్ణ, సంతోష్, అంజయ్య, విజయ్ కుమార్, తదితరులు, పాల్గొన్నారు.

## ఘనంగా బోనకల్ ప్రెస్ క్లబ్ 1వ వార్షికోత్సవం

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న టిడబ్ల్యూ జెఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు పల్లా కొండలరావు
- మధిర నియోజకవర్గంలో జర్నలిస్టులందరికీ ఇళ్ళ స్థలాలు ఇవ్వాలి
- త్వరలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ను కలుస్తాం
- టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు పల్లా కొండలరావు



టైమ్స్ ఆఫ్ వార్త - బోనకల్

మధిర నియోజకవర్గంలో జర్నలిస్టులందరికీ ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు పల్లా కొండలరావు కోరారు. ఈ విషయమై మధిర నియోజకవర్గంలో అన్ని మండలాల జర్నలిస్టు సోదరులను కలుపుకుని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ను కలుస్తామని తెలిపారు.మంగళవారం బోనకల్ ప్రెస్ క్లబ్ 1 వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దేగల వేలాద్రి అధ్యక్షతన మొదటి వార్షికోత్సవ వేడుకలు ప్రెస్ క్లబ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు,సీనియర్ జర్నలిస్ట్ పల్లా కొండలరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ కార్యాలయంలో ఏర్పాటు కేకును కట్ చేసి విలేకరులకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం పల్లా కొండలరావు మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ కార్యాలయం మొదటిసారి ప్రారంభించి విజయవంతంగా ఎలాంటి అవాంతరాలు లేకుండా దిగ్విజయంగా సంవత్సరకాలం పూర్తిచేసి, సభ్యులందరు ఐక్యమత్యంతో ముందుకు నడవడం ఎంతో అభినందనీయమన్నారు. ప్రెస్ క్లబ్ మరింత ప్రజాదారణ పొందాలని కొండలరావు ఆకాంక్షించారు,ప్రస్తుత రాజకీయ పరిస్థితులు- జర్నలిస్టులు వార్త సేకరణ శైలిలో మార్పు అనే అంశంపై పలు సూచనలు సలహాలు తెలిపారు.ప్రభుత్వాలు జర్నలిస్టులకు ఇచ్చిన హామీలు విస్మరిస్తున్నాయని భవిష్యత్తులో జర్నలిస్టుల హక్కుల సాధన కోసం యూనియన్ తో కలిసి నడవాలని పిలుపునిచ్చారు.ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దేగల వేలాద్రి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం తమ కలాన్ని ఎక్కుపెట్టి వాటి పరిష్కారం దిశగా పనిచేయాలన్నారు. వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమం కోసం త్వరలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కని కలిసి జర్నలిస్టుల సమస్యలపై యూనియన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ కే బడే, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు మందా సత్యానందం,ట్రెజరర్ షేక్ బాజీ షరీఫ్,సహాయ కార్యదర్శి యంగల గౌతం, ప్రెస్ క్లబ్ సభ్యులు మాగి ముఖేష్, నాగటి రాజశేఖర్,కొణతాలపల్లి నాగేశ్వరావు,సుగ్గల బ్రహ్మం,తగరం రమేష్,దారెల్లి రాకేష్ తదితరులు హాజరయ్యారు.

## బాన్సువాడలో వైభవంగా శ్రీ కోట దుర్గమ్మ ఆలయం రెండవ వార్షికోత్సవ వేడుకలు

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ



బాన్సువాడ రెవెన్యూ డివిజన్ కేంద్రంలోని కోటగల్లి ప్రాంతంలో నూతనంగా కొలువుదీరిన శ్రీ కోట దుర్గమ్మ ఆలయం రెండవ వార్షికోత్సవ వేడుకలను ఈనెల 2వ తేదీ నుండి మంగళవారం వరకు మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మొదటి రోజు నుండి నేటి చివరి రోజు వరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా కొనసాగాయి. అమ్మవారికి జలాభిషేకం, పంచామృత అభిషేకం తో పాటు 108 కళాశాలతో ప్రత్యేకంగా అభిషేక మహోత్సవం చేపట్టారు. ధూప, దీప, నైవేద్యాలతో పాటు హారతులు సమర్పించారు. రుద్ర హోమం, జంట నాగుల ప్రాణ ప్రతిష్ట, సామూహిక కుంకుమార్చన, మహోత్సవం చేపట్టారు. మంగళవారం నాడు అమ్మవారి ఉత్సవ విగ్రహానికి రతంలో ప్రత్యేకంగా ఊరేగించి కల్కి చెరువులో చక్రస్నానం చేయించి తిరిగి ఆలయానికి తీసుకొచ్చారు. అమ్మవారి డిజే ఆటపాటల నడుమ భక్తులు ఆడుతూ, పాడుతూ, అత్యంత భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. మూడు రోజులపాటు భక్తులకు మధ్యాహ్నం దాతల సహకారంతో అన్న ప్రసాద వితరణ మహోత్సవం నిర్వహించారు. మూడు రోజులపాటు హనుమాన్ మాల ధరించిన స్వాములకు ప్రత్యేకంగా బిక్షను ఏర్పాటు చేశారు. బాన్సువాడ గాయత్రి ఆశ్రమ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ సుదర్శన దండి కాశీ స్వామీజీ మహారాజ్ వారి ప్రత్యేక పర్యవేక్షణలో కార్యక్రమాలు కొనసాగాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు,కాలనీవాసులతోపాటు అమ్మవారి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై తీర్థ, ప్రసాద, నైవేద్యాల తోపాటు బిక్షను స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు పత్తి శ్రీకాంత్, అధ్యక్షుడు ఉప్పరి లింగం తో పాటు ఆలయ కమిటీ ప్రతినిధులు బాసం కాశీనాథ్, నరేష్, శ్రీనివాస్ తదితరులు, పాల్గొన్నారు.

## గుర్జల్ తాండలో నర్సరీ తనిఖీ

### ఎంపీడీవో రాజేశ్వర్

టైమ్స్ ఆఫ్ వార్త - గాంధారి



గాంధారి మండలంలోని గుర్జల్ తాండలో ఎంపీడీవో రాజేశ్వర్ తనిఖీ నిర్వహించారు . ముందుగా స్థానిక నర్సరీని సందర్శించి, మొక్కల పెంపకం, నిర్వహణపై ఆరా తీశారు.అనంతరం, గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యలపై మాజీ ఏఎంసీ చైర్మన్ తన్సింగ్‌తో చర్చించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో రాజేశ్వర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించడానికి అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

since: 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com
జనరల్ న్యూస్
GENERAL NEWS
బుధవారం,
05-03-2025


## ఘనంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు

# గునిగంటి కమలాకర్ జన్మదిన వేడుకలు

- ఆపద సమయంలో ఆపద్బాంధవుడు
- అభిమానుల గుండె చప్పుడు ఆయన
- పార్టీ నిట్టూర్పు దశలో ఉన్న సమయంలో భవిష్యత్ మనదే నని భరోసా కల్పించిన నాయకుడు.
- రానున్న లోకల్ బాడి ఎన్నికల్లో అవకాశాన్ని ఇవ్వాలని కార్యకర్తల, అభిమానుల అభిమతం
- నేడు ఆయన జన్మదిన సందర్భంగా ఆయా గ్రామాల్లో సంబురాలు
- ఐదు,పది చదువుతున్న విద్యార్థులకు పరిక్ష ఫ్యాడ్ అందజేత







టైమ్స్ ఆఫ్ వార్త - మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి

చిన్న గూడూరు మండలంలోని తన కంటు ఓ ప్రత్యేకత ను చాటుకుని పది సంవత్సరాలు ప్రతి పక్ష పార్టీ నాయకుడిగా ఉండి అష్టకష్టాలను ఎదుర్కొని సాటి కార్యకర్తలకు అండ గా నేనున్నాను అంటు గోప్ప భరోసా ఇచ్చే ప్రయత్నం చేసి సఫలికృతం ఐన నాయకుడిగా కమలాకర్ పేరుంది.గత అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా చేసుకుని అకుంఠిత దీక్షతో, పక్కా వ్యూహం తో ముందుకు వెళ్ళి, డాక్టర్ రామచంద్రనాయక్ గెలుపే ధ్యేయంగా పని చేసి కీర్తించబడ్డారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రావుల రాంరెడ్డి, దివ్యమైన ఆశీస్సులతో మండాలభి వృద్ధి చెందేలా చేసేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నారు. నేడు కమలాకర్ జన్మదినోత్సవం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఐదు,పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరిక్ష ఫ్యాడ్ లను అందించారు. చిన్నగూడూరు, గుండంరాజుపల్లి, జయ్యారం, పగిడిపల్లి ఉగ్గంపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, కేకు కట్ చేసి సంబురాలు చేసుకున్నారు.

మండల కేంద్రము లోని మహాకవుల దాశరథి ప్రాంగణంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తరలి వచ్చి కేకు కత్తిరించి మిఠాయి లు పంచారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమాలకు సినియర్ నాయకులు రావుల రాంరెడ్డి హజరు కమలాకర్ జన్మదినోత్సవం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఐదు పదవ తరగతి విద్యార్థులకు పరిక్ష ఫ్యాడ్ అందించే కార్యక్రమానికి రాంరెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా కమలాకర్ మాట్లాడుతూ తన పుట్టిన రోజు సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పరిక్ష ఫ్యాడ్ అందించడం జరిగిందన్నారు. పేద విద్యార్థులకు కంప్యూటర్ సిస్టం అందించేందుకు కృషి చేస్తానని చేస్తానని హామీ ఇచ్చారు.విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలని అభిలాషించారు. రానున్న రోజుల్లో మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామని పేర్కొన్నారు. ఈ జన్మదిన కార్యక్రమంలో మండల అధ్యక్షులు మారబోయిన వెంకటేశ్వర్లు, ఆయిల్ ఫామ్ అడ్వైజర్ కమిటీ సభ్యులు వల్లూరి కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు బిక్కు నాయక్, మార్కెట్ డైరెక్టర్ ఆవుల బిక్షపతి, మండల ప్రధాన కార్యదర్శిలు సుధాగాని నాగేష్, పట్ల కిరణ్, వాసం సుధాకర్, మాజీ వైస్ ఎంపీపీ పిల్లి వీరన్న, డోర్నకల్ నియోజకవర్గ అసెంబ్లీ యూత్ అధ్యక్షులు శాగంటి సందీప్, చిన్నగూడూరు యువజన అధ్యక్షుడు దాసరి రాజు ముదిరాజ్, యూత్ నియోజకవర్గ కార్యదర్శి బప్పటి రణధీర్, ఉద్యమకారుడు చిత్తారి సోమన్న, గ్రామ అధ్యక్షులు యాకన్న, బత్తెం రమేష్, గండ్ల భద్రయ్య, మురళి, వెంకటియ్య, మేఘ్యు, మాజీ కో ఆప్షన్ మీర్జా మోసిన్ బెగ్, సీనియర్ నాయకులు దొంగరి నరసయ్య, నీలం శంకరయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు చాట్ల రామచంద్, మెతుకు రాజేశ్వర్ రెడ్డి, దాసరి శ్రీను, మైనార్టీ సెల్ అధ్యక్షులు జహంగీర్, రఫీ, శ్రవణ్, గంగరబోయిన శ్రీను, ఇరబోయిన సుధాకర్, యాకూబ్, మాజీ సర్పంచ్ రాములు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీం నోటీసులు..



(మొదటి పేజీ తరువాయి)..

స్పీకర్ కార్యాలయానికి నోటీసులు జారీ చేస్తున్నట్టు ధర్మాసనం స్పష్టం చేసింది. స్పీకర్ కార్యాలయంతో పాటు, స్పీకర్ సెక్రెటరీ, రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం, ప్రతివాదులకు నోటీసులు ఇస్తున్నట్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ నెల 22లోగా వివరణ ఇవ్వాలని, తదుపరి విచారణ 25కు వాయిదా వేస్తున్నట్టు స్పష్టం చేసింది.

## బకాయిలు చెల్లించండి

(మొదటి పేజీ తరువాయి)..



సంఘాలతో సోలార్ విద్యుదుత్పత్తిని ప్రోత్సహిస్తున్నామని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. వారి విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. సమావేశంలో ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి మాణిక్‌రాజ్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్ చౌహాన్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ పరీక్షలకు సర్వం సిద్ధం

**మానసిక వత్తిడికి గురైతే 14416 టోల్ ఫ్రీ నెంబర్ ను ఫోన్ చేయండి.**

**యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు వెల్లడి**

టైమ్స్ ఆఫ్ వార్త - యాదాద్రి



5న జరిగే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర, 6న గురువారం నుండి నిర్వహించబడు ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు ఏర్పాటు పూర్తి చేశామని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్, జిల్లా ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారిని శ్రీమతి రమణి మంగళవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 29 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, అట్టి కేంద్రా లలో నిర్వహించబడు పరీక్షలకు చీఫ్ సూపరింటెండెం ట్‌లను, డిపార్ట్మెంటల్ అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ అధికారుల సూచన మేరకు జిల్లా కలెక్టర్‌తో సమావేశం ఏర్పాటు చేసి పరీక్షల నిర్వహణనపై వివరించడం జరిగిందని బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ సెక్రటరీ శ్రీమతి రమణి తెలిపారు. పరీక్షలు జరిగే సెంటర్లలో ఎటువంటి అవకతవకలు జరగకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినట్లు తెలిపారు. అలాగే ప్రతి కేంద్రానికి సిట్టింగ్ స్క్వాడ్ లను ఏర్పాటు చేయడం జరిగిందని. అలాగే రెవెన్యూ, పోలీస్ అధికారులతో ఫ్లైయింగ్ స్క్వాడ్ లను నియమించడం జరిగిందని వివరించారు. పరీక్షలకు సంబందించిన ప్రశ్నాపత్రాలను పరీక్ష కేంద్రాలకు సంబందించిన పోలీస్ స్టేషన్ స్టోరేజ్ లకు పంపించడం జరిగినది. ప్రతి పరీక్ష కేంద్రములో C.C కెమెరా నిఘా లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అలాగే పరీక్ష కేంద్రాలకు పరీక్షలు రాసే విద్యార్థులు ఎటువంటి మొబైల్ ఫోన్, గడియారాలను అనుమతి లేదని విద్యార్థులు ఈ విషయాలను గమనించాలని వారు కోరారు.. పరీక్షా కేంద్రానికి విద్యార్థినీ విద్యార్థులు15 నిమిషాల ముందే చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు ఎటువంటి మానసిక ఆందోళనకు గురికావొద్దని ప్రశాంత వాతావరణం లో పరీక్షలు వ్రాయాలని జిల్లా కలెక్టర్, ఇంటర్మీడియట్ ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ తెలపారు. ఎవరయినా మానసిక ఆందోళనకు గురైయితే టూల్ ఫ్రీ నెంబర్ 14416 తో సంప్రదించాలని కోరారు.

# రేపటి నుంచి తెలంగాణ తిరుమల తిరుపతి బ్రహ్మోత్సవాలు..

**ముస్తాబైన ఆలయం.. బ్రహ్మోత్సవాలను ప్రారంభించనున్న పోచారం శ్రీనివాస్ రెడ్డి..**

**భక్తులకు అన్నదానం ఏర్పాట్లు..**

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వెంకటేశ్వర స్వామి దశమ బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ముస్తాబ్ చేశారు. నేటి నుంచి తొమ్మిదవ తేదీ వరకు శ్రీ వెంకటేశ్వర స్వామి దశమ బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి శ్రీ వెంకటేశ్వర స్వామి దశమ బ్రహ్మోత్సవాలను ప్రారంభించనున్నారు. కలియుగ దైవం శ్రీనివాసుడు ఆల యాన్ని తెలంగాణలో అతిపెద్ద దేవాలయంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడే ఆలయ నిర్మాణానికి అంకురార్పణ చేశారు. అనంతరం రాష్ట్ర శాసనసభ స్పీకర్ గా పనిచేసిన పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆలయ నిర్మాణానికి కృషి చేశారు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో ఎంతో అద్భుతంగా 60 ఎకరాల స్థలంలో తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానం ను కామారెడ్డి జిల్లా, నసురుల్లాబాద్ మండలం, తిమ్మాపూర్ గ్రామ శివారులో గుట్టపై నిర్మించారు. ఆలయం వరకు తారు రోడ్లను, సిమెంట్లను నిర్మించి, గుట్ట పైకి బైకులు, కార్లు, బస్సులు, వెళ్లే విధంగా కొండపైకి భక్తులు కాలినడకన నడుచు కుంటూ వెళ్లే విధంగా సైతం మెట్లు ఏర్పాటు చేశారు. తిరుపతి లో ఉన్న తిరుమల తిరుపతి దేవస్థానం మాదిరిగా తెలంగాణ



తిరుమల తిరుపతి గా తిమ్మాపూర్ లో పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వా నిధులను మంజూరు చేయించి నిర్మించారు.

**శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శన బ్రహ్మోత్సవాలు...**

బాన్సువాడ నియోజకవర్గం నసర్లాబాద్ మండలం తిమ్మాపూర్ వద్ద నిర్మించిన తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానం దశమబ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ బ్రహ్మోత్సవాలకు కామారెడ్డి, నిజాంబాద్, జుక్కల్, ఎల్లారెడ్డి, నియోజకవర్గ లతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని హైదరాబాద్, సిద్దిపేట, రాజన్న, సిరిసిల్ల, కరీంనగర్ తో పాటు పలు జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరానున్నారు. మంగళవారం ఉదయం విష్ణు సహస్ర పారాయణంతో వేద పండితుల మంత్రోచ్చారణాలతో ప్రారంభమైన ఉ త్సవాలుప్రతిరోజుకార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈనెల 7న శ్రీ లక్ష్మీ గోదా సమేత శ్రీవేంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం నిర్వహించనున్నారు. మాడవీధులలో స్వామివారి ఊరేగింపులు వంటి వాటితో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. శ్రీ వెంకటేశ్వర స్వామి దశమ బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. ఈ ఉత్సవాలు ఈనెల తొమ్మిదోతేదీనముయ్యనున్నాయి పోచారం శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులు, కుటుంబ సమేతంగా ఈ ఉత్సవాల్లో పాల్గొంటారు. మాడవీధుల్లో స్వామివారి పల్లకి సేవలో పాల్గొంటారు. బాన్సువాడ, నసురుల్లాబాద్, తిమ్మాపూర్, గ్రామస్తులు ఉత్సవాల్లో పాల్గొని భక్తులకుసేవలు అందించను న్నారు. కోనేరు తో పాటు గరుడ స్వామి, శ్రీనివాసులు, లక్ష్మీదేవి, పద్మావతి, గోదాదేవి, ఆలయాలు ఉన్నాయి. భక్తుల భోజనాలకు అన్న సత్రం తో పాటు భక్తులు ఉండేందుకు వసతి సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేశారు.

**ఉత్సవాలకు ప్రత్యేక బస్సు సౌకర్యం...**

బాన్సువాడ నుండి ప్రత్యేక బస్సు సౌకర్యాలు తిమ్మాపూర్ వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు ఉత్సవాలు జరిగే రోజులు ప్రత్యేకంగా నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేశారు. ఉత్సవాలు తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఉ త్సవాన్ని విజయవంతం చేయాలని, ఆలయ కమిటీ ధర్మకర్తలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, పోచారం శంభు రెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొనడంతో పాటు భక్తులు ఉత్సవాలు పాల్గొనా లని ఆలయ కమిటీ సభ్యులు మద్దినేని నాగేశ్వరరావు కోరారు.

## బోధన్ పట్టణంలో ఎన్ఎస్ఎస్ఓ సర్వే

**చిన్న వ్యాపారాల లెక్కలు తేల్చే ప్రయత్నం**



టైమ్స్ ఆఫ్ వార్త - గాంధారి

కేంద్ర గణాంక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్ఎస్ఓ ) నిజామాబాద్ బృందం, బోధన్ పట్టణంలో "అన్ఇన్‌కార్పొరేటెడ్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్" (ASUSE) సర్వేని నిర్వహించింది. ఈ సర్వే ముఖ్య ఉద్దేశ్యం ఏమిటంటే, వ్యవసాయేతర రంగంలోని చిన్న వ్యాపారాల ఆర్థిక పరిస్థితిని, వాటి పనితీరును తెలుసుకోవడం. ఈ సర్వేలో, అనుజ్ కుమార్ (సీనియర్ స్టాటిస్టికల్ అధికారి), పి.బి.ఇందాల్ సింగ్, పి.ప్రతాప్ (సర్వే ఎన్యూమరేటర్లు), మండల ప్రణాళిక అధికారి అశోక్ పాల్గొన్నారు.

## చండీ హెూమంలో పాల్గొన్న బండి రమేష్, యుగంధర్ రెడ్డి

టైమ్స్ ఆఫ్ వార్త - కూకట్ పల్లి



కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ లోని చెరబండ రాజునగర్ లో మంగళవారం జరిగిన చండీ హెూమంలో కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్, ఎ బ్లాక్ ఉ పాధ్యక్షుడు మాధిరెడ్డి యుగంధర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ చెరబండ రాజునగర్ లోని ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవాలయం ప్రాంగణంలో జరుగుతున్న చండీ యాగం ఒక మంచి కార్యక్రమం అని అన్నారు. చండీ యాగంతో సకల భక్తుల యొక్క కష్టాలు తీరిపోయి, సుఖశాంతులతో జీవిస్తారని ఆ భగవంతుడు కరుణా కటాక్షాలు కురిపిస్తాడని అన్నారు. ఆలయ అభివృద్ధికి భక్తులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. చండీ హెూమనికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనడంతో చక్కటి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొందని అన్నారు. భక్తి భావాన్ని మరింత పెంపొందించే ఆలయ ధర్మకర్తల మండలి కృషి చేయాలని పిలుపునిచ్చారు. విధంగా ఈ కార్యక్రమంలో కూకట్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కొండకింది పుష్పా రెడ్డి, ఓల్డ్ బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ నల్లొల్ల రాజేందర్, ఫిషర్ మెన్ కమిటీ వైస్ చైర్మన్, బాలానగర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఆకుల నరేందర్ ముదిరాజ్, ఫతేనగర్ డివిజన్ దళిత నేత చిటకోరు క్రిష్ణ, కూకట్పల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లిగారి లక్ష్మయ్య, మాజీ కౌన్సిలర్ నల్లాల రమేష్, ఎ బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి, జెల్ల శివ, తదితరులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధితో బ్రతుకుతున్న ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు

**కృష్ణా రావును కలసి వినతి పత్రం అందజేసిన ఇసుక వ్యాపారస్తులు..**

టైమ్స్ ఆఫ్ వార్త - కూకట్ పల్లి

కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని పర్వతనగర్ తదితర ప్రాంతాల్లో ఇసుక వ్యాపారం చేసుకొని జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారులు ఏమ్మెల్యే మాధవరం కృష్ణారావు ని క్యాంపు కార్యాలయంలో కలవడం జరిగింది. అనేక సంవత్సరాలుగా తాము ఇసుక వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని ఏ నాడు కూడా ఎవరూ కూడా మమ్మల్ని ఇబ్బంది పెట్టలేదని ఇటీవల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశించిందని, పోలీసులు రెవెన్యూ అధికారులు వచ్చి మా వాహనాలను ఇసుక కుప్పలను సీజ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా వేలాది రూపాయలు ఫైన్ విధిస్తున్నారని ఏమ్మెల్యే దృష్టికి తెచ్చారు. న్యాయం చేయాలని కోరుతూ ఈ మేరకు వినతి పత్రం కూడా ఇచ్చారు. ఇసుక వ్యాపారుల ఆవేదనను అర్థం చేసుకున్న ఏమ్మెల్యే వెంటనే జిల్లా కలెక్టర్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ కు లేక రాసి కేసులు నమోదు చేసి ఇబ్బందులు పెట్టొద్దని ప్రభుత్వ ఆదేశాలపై ముందుగా ప్రజలకు చిరు వ్యాపారులకు అవగాహన కల్పించాలని సూచించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా స్వయం ఉపాధితో బ్రతుకుతున్న ప్రజలను ప్రభుత్వం లక్ష్యంగా చేసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు..



since 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com
జనరల్ న్యూస్
GENERAL NEWS
బుధవారం,
05-03-2025


# సుదీర్ఘ విరామం అనంతరం నేడు జరగనున్న స్ట్రక్చరల్ సమావేశం

● పోరాటాల సంఘం సాదించేనా....? సర్దుకుపోయినే...?
● సొంతింటి కల, పెర్క్స్ పై ఐటి మాఫీ, మార్లు పేర్ల డిమాండ్లు సాకరమయ్యేనా...?
● సిఎండి సమావేశంపై గంపడాశతో కార్మికులు

టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-



సుదీర్ఘ విరామం అనంతరం సింగరేణి సిఎండి తో గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియుసి స్ట్రక్చరల్ సమావేశం నేడు జరగనుంది. కొన్ని సంవత్సరాల తర్వాత సమావేశం నిర్వహణ నిర్వహిస్తుండటంతో కార్మికుల సమస్యలు ఏవేవి చర్చలోకి వచ్చి, పరిష్కారం అవుతాయని గంపడాశతో సింగరేణి వ్యాప్తంగా కార్మిక వర్గం ఎదురుచూస్తోంది. రాజకీయ జోక్యంతో టిబిజికెఎస్ ఎన్నికలను వాయిదా వేస్తూ వస్తుండగా ఎన్నికలు నిర్వహించాలని ఏఐటియుసి పట్టు పట్టి, కోర్టుకు వెళ్లి ఎన్నికలు జరిగేలా చేసింది. దీంతో గత డిసెంబర్ లో జరిగిన సింగరేణి ఎన్నికల్లో సింగరేణి వ్యాప్తంగా గుర్తింపు కార్మిక సంఘంగా ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘంగా ఐఎన్టియుసి గెలుపొందింది. ఎన్నికల నిర్వహించి 11 నెలలు జరిగినప్పటికీ గత సెప్టెంబర్ 09,2024 లో గెలిచిన సంఘాలకు గుర్తింపు పత్రం అందజేయడం జరిగింది. ఈ నేపథ్యంలో గుర్తింపు కార్మిక సంఘంతో సింగరేణి యాజమాన్యం కార్పొరేట్ స్థాయి స్ట్రక్చర్ సమావేశం గతంలో నిర్వహించగా, బుధవారం సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ తో సిఎండి స్థాయిలో స్ట్రక్చరల్ సమావేశం నిర్వహించనున్నారు. పోరాటాల యూనియన్ గా పేరు ఉన్న ఏఐటియుసి సుధీర్ఘ విరామం అనంతరం సిఎండి తో జరుగుతున్న స్ట్రక్చరల్ సమావేశంలో ఏ మేరకు ఒత్తిడి చేసి, డిమాండ్లు సాధించుకొని వస్తుందోనని కార్మిక వర్గం ఎదురుచూస్తోంది. ఎన్నికల ప్రచారంలో ఏఐటియుసి కార్మిక వర్గానికి సుమారు 42 డిమాండ్లతో కూడిన ఎన్నికల మ్యానిఫెస్టోను విడుదల చేయగా, నేటి సమావేశంలో ఏఏ డిమాండ్లను చర్చలోకి తీసుకువచ్చి, ఆమోదింపజేస్తుందని సర్వత్ర ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో జరుగుతున్న సమావేశాలపై కార్మికుల అంచనాలు భారీగా ఉన్నాయని చెప్పవచ్చును. ముఖ్యంగా కోలిండియాలో పెర్క్స్ పై ఐటీ రియంబర్స్మెంట్ ఒప్పందంలో ఏఐటియుసి భాగస్వామ్యం ఉన్నదని, నేటి సమావేశంలో సింగరేణిలో సైతం ఆ ఒప్పందాన్ని అమలు చేసి, కార్మికుల్లో తన పట్టును ఏఐటియుసి నిలుపుకుంటుదా అనే చర్చ సింగరేణి వ్యాప్తంగా వినబడుతుంది. ఏఐటీయూసీ సింగరేణి కార్మికులకు ఇచ్చిన డిమాండ్లో ముఖ్యంగా కార్మికులకు ఐటి మాఫీ, సొంతింటి కల, మారు పేర్లు, 20 లక్షల వడ్డీలేని రుణం, ఎన్ మైనస్ వన్ ప్లేడే లు, మహిళలకు నెలసరి లీవులు, సూపర్ స్పెషాలిటీ వైద్యం, క్యాడర్ స్కీముల సవరణ, వంటి సుమారు 42 డిమాండ్లను ఏఐటియుసి తన ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచారు. ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీల్లో నేడు జరగబోయే సమావేశంలో యూనియన్ నేతలు ఏ మేరకు కార్మిక వర్గానికి లబ్ధి చేకూర్చే విధంగా వ్యవహరిస్తోందో వేచి చూడాలి. ఇప్పటికే లాభాల వాటా విషయంలో గనులపై నిర్వహించిన భోజనాలలో సైతం ఏఐటీయూసీ అభాసుపాలు అయ్యింది. కార్మిక వర్గంలో నెలకొన్న అప్రతిష్టను తొలగించేలా ఈ సమావేశంలో ఒప్పందాలు చేసి, కార్మికుల మన్ననలు పొందుతారా, లేదా అనేది నేడు తేటతెల్లం కానుంది. లేదా గత గుర్తింపు కార్మిక సంఘం మాదిరి సాగదీత ధోరణితో వ్యవహరిస్తుందా అనేది వేచి చూడాలి. సింగరేణి కార్మికులు ప్రస్తుతం ఐటీ కోతులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో పెర్క్స్ పై ఐటి రియంబర్స్మెంట్ ఒప్పందాన్ని అమలు చేయగలిగితే ఏఐటీయూసీ కార్మిక వర్గం తోపాటు విపక్ష కార్మిక సంఘాల మన్ననలు పొందుతుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. కార్మికుల ఎదురుచూపులు, తీవ్ర ఉత్కంఠ నేపథ్యంలో సుదీర్ఘ కాలం అనంతరం నిర్వహిస్తున్న సిఎండి స్థాయి చర్చల సమావేశంలో ఏ మేరకు కార్మికులకు లబ్ధి చేకూరేలా ఒప్పందాలు జరుగుతాయో, లేదా, డిమాండ్లు సాధనకై సాగదీత దోరణిని కొనసాగిస్తూ, కార్మికులను మభ్యపెడుతుందో అని గంపెడు ఆశతో కార్మికులు ఎదురు చూస్తున్నారు....

# కూకట్ పల్లి ఎమ్మెల్యే, ఫతేనగర్ కార్పొరేటర్ ఇద్దరూ దరిద్రులు.. దౌర్భాగ్యులు

కాంగ్రెస్ నేతల ఎద్దేవా



టైమ్స్ ఆఫ్ వార్త – కూకట్ పల్లి

అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ చిత్తుగా ఓడిపోయి చాలా బ్యాడ్ లక్ జరిగిందని, బిఆర్ఎస్ పార్టీ నేతలు ముఖ్యంగా ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు దరిద్రమైన జీవితం గడపటమే కాకుండా దౌర్భాగ్య స్థితిలో కాలం వెళ్లదీస్తునామని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ తన మనసులో మాటలు వెళ్లగక్కి ఆవేదన వ్యక్తం చేశాడని కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు మంగళవారం బాలానగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ లేకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం మీద బురద జల్లుతారా..? పది సంవత్సరాలు అధికారంలో ఉండి అత్యవసరంగా చేపట్టాల్సిన 30 ఏళ్ల ఫతేనగర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులను చేపట్టాలని దరిద్రులు మాజీ మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్ లు, అంతకంటే పెద్ద దరిద్రుడు కూకట్పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఆ తరువాత ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ అధ్యక్షుడు నాగిరెడ్డి, ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి, కూకట్పల్లి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మాల్లిగారి లక్ష్మయ్య, సూరజ్ తివారీ, అహ్మద్, తదితరులు పాల్గొన్నారు..

# పంట పొలాల్లోకి దూసుకెళ్లిన పోలీస్ వాహనం...

టైమ్స్ ఆఫ్ వార్త–బోధన్



పోలీసు వాహనం ప్రమాదవశాత్తు పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా కొట్టిన ఘటన మంగళవారం బండారుపల్లి శివారులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బోధన్ మండలం కల్దుర్కి గ్రామం నుండి బోధన్ వైపుకు వస్తున్న బోధన్ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన పోలీస్ వాహనం బండారుపల్లి బ్రిడ్జి వద్ద ప్రమాదవశాత్తు అదుపుతప్పి పంట పొలాల్లోకి వెళ్లి బోల్తా కొట్టింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. డ్రైవర్ కు స్వల్ప గాయాలైనట్టు స్థానికులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన పోలీసులు

● అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు
● ఈజీ మనీ కోసం యువత దారి తప్పవద్దు : సబ్ ఇన్స్పెక్టర్ శివరామకృష్ణ

టైమ్స్ ఆఫ్ వార్త – చంద్రుగొండ



చెడువసనాలకు బానిసలు కాకుండా ఉండాలని పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు యువతకు కళాశాలలో పాఠశాలల్లో ప్రధాన కూడలి వద్ద గంజాయి,డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై యువతకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కొంతమంది యువత ఈజీ మనీ కోసం గంజాయి సేవించడం మరియు తరలించడం లాంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఇటువంటి సంఘటన సోమవారం చంద్రుగొండ మండలంలో చోటుచేసుకుంది వివరాల్లోకి వెళితే చంద్రుగొండ మండల కేంద్రంలో వాహన తనిఖీలు చేపట్టిన పోలీస్ అధికారులకు అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని ప్రశ్నించగా అతని వద్ద సుమారు 500 గ్రాముల గంజాయి ఉన్నట్లు నిర్ధారణ అయింది.నిందితుని విచారించగా చంద్రుగొండ మండల కేంద్రానికి చెందిన దాసరి వెంకటేశ్వరావు గుర్తించారు. నిన్ను తుని వద్ద నుండి 500 గ్రాముల గంజాయి ఒక చరవాణి ద్విచక్ర వాహనాన్ని స్వాధీన పరుచుకున్నారు. పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి విచారణ నిమిత్తం కోర్టులో హాజరు పరిచారు.అనంతరం సబ్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ యువత డబ్బు కోసం అదే విధంగా మత్తు కోసం గంజాయి సేవించడం గంజాయి తరలించడం లాంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి జూదం పేకాట కోడిపందాలు లాంటి అసాంఘిక కార్యకలాపాలు సమాచారం అందించాలని తెలిపారు. అదేవిధంగా ఇట్టి సమాచారం అందించిన వ్యక్తుల వివరాలను కోపంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు.

# కుల గణన సర్వే వైఫల్యానికి ప్రభుత్వానిదే బాధ్యత : తెల్ల హరికృష్ణ

టైమ్స్ ఆఫ్ వార్త – కూకట్ పల్లి



రాష్ట్రం లో చేపట్టిన కుల గణన సర్వే వైఫల్యానికి కాంగ్రెస్ ప్రభుత్వానిదే బాధ్యతని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా బీసీ సంక్షేమ సంఘం బీసీ జర్నలిస్టు ఫోరం అధ్యక్షులు తెల్ల హరికృష్ణ అన్నారు. గతంలో పాల్గొనని 3.56 లక్షల కుటుంబాల కోసం ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు నిర్వహిం చిన బీసీ కుల గణన సర్వేలో ఎంత మంది పాల్గొన్నారో వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. సోమవారం కూకట్ పల్లి భాగ్యనగర్ కాలనీ లోని వారి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కొట్టే వేణు, రాహుల్ తేజ, తెల్ల చంద్రశేఖర్, దండే శ్రీకాంత్, కొట్టే మహేష్, వీరు, నర్సింగ్, శ్రీనివాస్ తో కలిసి నిర్వహించిన సమావేశంలో ఈ విధంగా చర్చించుకొని మాట్లాడడం జరిగింది, కుల గణన సర్వేపై విస్తృత ప్రచారం చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు సర్వే దరఖాస్తు ఫారాలు హెూటల్ లో పేపర్ ప్లేట్లుగా, ప్రభుత్వ కార్యాలయంలో చిత్తు కాగితాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు.

# తెలంగాణ జన సమితి కార్మిక విభాగం గ్రేటర్ హైదరాబాద్ సానిటరీ శాఖ ఇన్చార్జిగా ఆకుల పద్మ

టైమ్స్ ఆఫ్ వార్త – కూకట్ పల్లి

తెలంగాణ జన సమితి కార్మిక విభాగం గ్రేట్ హైదరాబాద్ సానిటరీ శాఖ ఇన్చార్జిగా మేడ్చల్ మల్కాజ్గిరి లోని కూకట్పల్లి కి చెందిన ఆకుల పద్మ నియమితులయ్యారు. ఈ మేరకు అందుకు సంబంధించిన నియామక పత్రాన్ని తెలంగాణ జన సమితి వ్యవస్థాపకులు కోదండరాం సార్, రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి పల్లె వినయ్ కుమార్ చేతుల మీదుగా ఆకుల పద్మ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకంతో గ్రేటర్ పరిధిలోని కార్మిక విభాగం సానిటరీ శాఖ ఇన్చార్జిగా నియమించిన తెలంగాణ జన సమితి వ్యవస్థాప కులు కోదండరాం సార్ కు, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రేటర్ పరిధిలోని కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ పరిష్కారం కోసం పాటుపడతానన్నారు. అనంతరం కోదండరాం సార్ తో పాటుగా ఆకుల శ్రీనివాస్, పల్లె వినయ్ కుమార్ లను పద్మ శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు.



# రామకృష్ణాపురంలో మాదిగ అమరవీరులకు ఘన నివాళి


టైమ్స్ ఆఫ్ వార్త – చింతకాని



ఖమ్మం జిల్లా చింతకాని మండలం, రామకృష్ణాపురం గ్రామంలో సాయంత్రం గ్రామ అధ్యక్షుడు పగిడిపల్లి నవీన్ ఆధ్వర్యంలో మాదిగ మృతవీరులకు ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పగిడిపల్లి రవీంద్ర మాదిగ మాట్లాడుతూ 30 ఏళ్ల సుదీర్ఘ ఉద్యమ పోరాటంలో ఎంతో మంది అమరులయ్యారని, వారందరినీ ప్రతి సంవత్సరం ఒకరోజు మదిలో తలచుకోవాలని, యావత్ మాదిగ జాతి వారి త్యాగాలను స్మరించుకోవాలని, వారి త్యాగాలు లేనిదే 30 ఏళ్ల సుదీర్ఘ ఉద్యమం నడవలేదని, వారి అమరత్వం ఫలితమే వర్గీకరణ సాధించుకోబడుతుందని గుర్తు చేశారు. అలాగే కృష్ణ మాదిగ 5వ తారీఖున ఖమ్మం జిల్లాకు రాబోతున్నందున మండలంలో ఉన్న అన్ని గ్రామాల నుంచి మాదిగ యువకులు, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున డప్పులతో ఖమ్మం చేరుకొని ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చిర్రా ఉపేంద్ర మాదిగ ,ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు గద్దల అనిల్ మాదిగ ,మండల కమిటీ సభ్యుడు కుక్కల దిలీప్ మాదిగ,గ్రామ కమిటీ సభ్యులు గద్దల మహేష్, పగిడిపల్లి శివ, మరి ఆకాష్, సూదుల నాగేంద్రం, గుర్రం లాలు, పగిడిపల్లి కృష్ణ సోదర బాలయ్య , పగిడిపల్లి రామారావు, రాయబారపు వీరాంజనేయులు, గుంటి రాంబాబు, బుర్ర జయరాజు, ఆదిత్య ,గద్దల బాబు ,సూదుల మరియమ్మ ,గుర్రం సూరమ్మ, గుడి మంగమ్మ యువకులు పిల్లలు పాల్గొన్నారు.

# ఎడపల్లి మండలంలో గావ్ చలో అభియాన్

టైమ్స్ ఆఫ్ వార్త – ఎడపల్లి



ఎడపల్లిమండలంలోని కుర్నాపల్లి, జైతపూర్ గ్రామాల్లో బీజేవైఎం ఆధ్వర్యంలో గావ్ ఛలో అభియాన్ ( పల్లెకుపోద్దాం) కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నుండి పొందుతున్న పథకాల గురించి,అంగన్వాడీ,హెల్త్ సబ్ సెంటర్లు, జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలలు, అలాగే గ్రామీణ ఉపాధి హామీ పథక కూలిలతో రేషన్ షాప్ డీలర్లతో పీఎం గరీబ్ కళ్యాణ్ యోజన ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రవాసి కార్యకర్తలు ముఖ్య అతిథిగా బీజేవైఎం మాజీ ఎడపల్లి మండల్ అధ్యక్షుడు బర్ధిపూర్ ప్రణయ్, బీజేవైఎం మాజీ ఎడపల్లి మండల ప్రధాన కార్యదర్శి మరాఠి వీరేందర్ రావు, కుర్నాపల్లి, జైతపూర్ బూత్ స్థాయి కార్యకర్తలు సాయివేణు, దేవేందర్, రాకేష్, రాజేందర్, నాగరాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి అంటే నమ్మకం కాదు.. అమ్మకం

(మొదటి పేజీ తరువాయి)..



48 మిలియన్ టన్నుల లైమ్‌స్టోన్ నిల్వలతో సకల వనరులు కలిగిన ఈ సంస్థను అంగడి సరుకుగా మార్చిన పాపం మోడీ ప్రభుత్వానిదే అని మండిపడ్డారు. సిసిఐకి చెందిన ఎంతో విలువైన యంత్ర పరికరాలను పాత ఇనుప సామాన్ల కింద లెక్క కట్టి ఆన్‌లైన్‌లో అమ్మడానికి టెండర్లు పిలవడం బిజెపి ప్రభుత్వ దగుల్బాజీ తనానికి నిదర్శనం అని వ్యాఖ్యానించారు. నిర్మాణ రంగంలో సిమెంట్‌కు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని సిసిఐని పునఃప్రారంభించి కార్మికులను ఆదుకోవాలని పదుల సార్లు కేంద్ర మంత్రులను తమ ప్రభుత్వం కోరినా, కనీసం వారు కనికరించకపోవడం ఆదిలాబాద్ ప్రజలకు వెన్నుపోటు పొడవడమే అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## బిఆర్ఎస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేసింది :

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి సిసిఐ ఫ్యాక్టరీని పునఃప్రారంభించేందుకు బిఆర్ఎస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేసిందని కెటిఆర్ అన్నారు. సిసిఐను తిరిగి ప్రారంభిస్తే ఆదిలాబాద్‌లోని వేలాది మంది యువతకు ఉపాధి దొరుకుతుందన్న ఉద్దేశ్యంతో ప్రధాని మోదీతో పలుమార్లు ఈ విషయంపై నాటి ముఖ్యమంత్రి కెసిఆర్ చర్చలు జరిపారని గుర్తు చేశారు. తానే స్వయంగా కేంద్ర మంత్రులైన నిర్మలా సీతారామన్, మహేంద్రనాథ్ పాండే, పీయూష్ గోయల్‌లను పలుమార్లు కలవడంతో పాటు కేంద్ర ప్రభుత్వానికి లేఖలు కూడా రాశానని తెలిపారు. పబ్లిక్–ప్రైవేట్ భాగస్వామ్యం లేదా జాయింట్ వెంచర్ రూపంలో సిసిఐ యూనిట్‌ను తిరిగి తెరిచే విషయాన్ని పరిశీలిస్తామని 2016లో అప్పటి కేంద్ర భారీ పరిశ్రమలు, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ మంత్రి అనంత్ గీతే ప్రకటించారని గుర్తుచేశారు. కానీ కేంద్రమంత్రి మాటలు నీటి మీది రాతలుగానే మిగిలాయని విమర్శించారు. 2018 ఎన్నికల ప్రచారంలో సిసిఐని తెరుస్తామని హామీ ఇచ్చిన బిజెపి, ఇప్పుడు ఆ సంస్థను స్క్రాప్‌గా అమ్మేందుకు ఆన్‌లైన్ టెండర్లు పిలవడం ఆదిలాబాద్ ప్రజలకు చేసిన మోసమేనని ఆరోపించారు. అదిలాబాద్ వచ్చిన ప్రతి సందర్భంలో బిజెపి నాయకులు సిసిఐని తెరిపిస్తామని ఇచ్చిన హామీలను ఇప్పుడు మర్చిపోయారని విమర్శించారు. కేంద్ర మంత్రులు అమిత్ షా నుంచి మొదలుకొని హంసరాజ్ గంగారం వరకు ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో లబ్ధి కోసం సిసిఐ తెరిపిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు అప్పనంగా అమ్మివేస్తున్నారని అన్నారు. ఈ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకునే వరకు కార్మికులతో కలిసి ఉద్యమిస్తామని, సంస్థ పరిరక్షణ కోసం పోరాడతామని కెటిఆర్ ప్రకటించారు.

**PRINTED, PUBLISHED & OWNED BY** MANKALA DASU, H.NO, 3-8-289, Road No. 2 SURYODAYA COLONY , LB NAGAR, HYDERABAD-36. PRINTED AT y.v. reddy, binding works, h.no.5-20, shivani hotel line, gurga nagar, Hyderabad-36, Telangana.Editor MANKALA DASU, RNI NO. **APTEL/2007/22828** CELL: 9705506999